నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శుక్రవారం 19-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 189 పేజీలు: 4 వెల: రూ.1/-

బడ్జెట్ ప్రవేశానికి ముందు స్వామి ఆశీస్సులు

వేంకటేశ్వరుడిని దర్శించుకున్న మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): ఆర్థిక మంత్రి హరీశ్ రావు ఉదయం 11.30 గంటలకు శాసన సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సందర్భంగా ముందుగా జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలు జరగుతున్న సందర్భంగా మంత్రి హరీశ్ రావు ఇక్కడికి వచ్చి స్వామి ఆశీర్వచనం పొందారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో 2021-22 బ్జడెట్‌ను సభలో ప్రవేశపెట్ట బోతున్నామని చెప్పారు. ప్రజలందరికి మంచి జరగాలని, సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా పేదల సంక్షేమం కోసం, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునేలా బడ్జెట్‌ను రూపొందించామని చెప్పారు. స్వామివారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ బడ్జెట్ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అన్నిరకాలుగా మేలు చేస్తుందనే సంపూర్ణమైన విశ్వాసం ఉందని చెప్పారు.

నల్లగొండ ఫ్లోరైడ్ పీడ విరగడైంది

అక్కడి తాగునీటి కష్టాలను తొలగించిన ఘనత కెసిఆర్‌దే

ఆనాటి కెసిఆర్ పాటను అసెంబ్లీలో పాడిన మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్ రావు వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా నల్లగొండ ఫ్లోరైడ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన కెసిఆర్ రాసిన పాట పాడారు. 'చూడు చూడు నల్లగొండ... గుండె మీద ఫ్లోరైడ్ బండ.. బొక్కలొంకరుబోయిన బతుకులా.. మన నల్లగొండ.. దుఃఖమెల్లాదీసేదెన్నాళ్లు' ఇది నల్లగొండ తాగునీటి కష్టాలను చూసి చలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రాసిన పాటని మంత్రి చెప్పారు. ఆనాడు ఫ్లోరైడ్ దుఃఖంమీద ఆవేదనతో పాటరాసిన ఆయనే ఈనాడు ఫ్లోరైడ్ పీడను శాశ్వతంగా తొలగించారన్నారు. నల్లగొండలో ఫ్లోరైడ్ పీడ అంతమైందని, కొత్తగా ఎవరూ ఫ్లోరోసిస్ బారిన పడడంలేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా ప్రకటించిందని హరీశ్ రావు అన్నారు. మిషన్ భగీరథ పథకం నల్లగొండ ఎ÷-లోరైడ్ కష్టాలకు చరమగీతం పాడిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఎండాకాలం వస్తే.. మహిళలు కుండలు పట్టుకుని మైళ్ల దూరం నడిచి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఆదిలాబాద్ ఆదివాసి ప్రాంతంలో జనం కలుషిత నీరు తాగి డయేరియా కారణంగా మరణాలబారిన పడేవారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి కేసీఆర్ ఐదేళ్లలోనే తాగునీటి కష్టాలు తీర్చారన్నారు. ప్రభుత్వం పట్టుదలతో పనిచేసి మిషన్ భగీరథ పథకాన్ని వేగంగా పూర్తి చేసింది, తద్వారా రాష్ట్రంలోని అన్ని అవాసాలకు శుద్ధి చేసిన సురక్షిత జలాలు ఇంటింటికి నల్లాల ద్వారా అందుతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు.

తెలంగాణ ఆకాంక్షల మేరకు బడ్జెట్ కేటాయింపులు

వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా నిధులు
ప్రగతిలో అనేక రాష్ట్రాలను అధిగమించిన ఏడేళ్ల తెలంగాణ
కరోనాతో ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందన్న మంత్రి
2021-22 సంవత్సరానికి బడ్జెట్ విలువ రూ. 2,30,825.96 కోట్లు.
రెవెన్యూ వ్యయం రూ. 1,69,383.44 కోట్లు గా అంచనా
మూలధన వ్యయం రూ. 29.046.77 కోట్లుగా అంచనా
వ్యవసాయానికి రూ. 25వేల కోట్లు కేటాయింపు
రైతుబంధుకు రూ. 14, 800 కోట్లు ...రైతు రుణమాఫీ కోసం రూ. 5, 225కోట్లు..
రైతుబీమా కోసం రూ. 1200 కోట్లు ..పశుసంవర్ధక శాఖకు 1730 కోట్లు,
సాగునీటి రంగానికి 16,931 కోట్లు.. సమగ్ర భూ సర్వే కోసం 400 కోట్లు
సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్‌కు రూ. వెయ్యి కోట్లు..
కొత్త సచివాలయ నిర్మాణానికి 610 కోట్లు...
నగర మంచినీటి పథకానికి 250 కోట్లు
బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాన్ని కల్పించిన సీఎం కేసీఆర్‌కు హరీశ్‌రావు కృతజ్ఞతలు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): అభివృద్ధి,సంక్షేమంతో పాటు తెలంగాణ ఆకాంక్షలు లక్ష్యంగా సిఎం కెసిఆర్ నాయకత్వంలో ముందుకు పోతున్నామని ఆర్థికమంత్రి హరీష్ రావు ప్రకటించారు. గ్రామాలను తీర్చిదిద్దడం, పేదలను ఆదుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని మంత్రి హరీష్ రావు తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. 2021-22 సంవత్సరానికి గానూ తెలంగాణ బడ్జెట్ విలువ రూ. 2,30,8 25.96 కోట్లు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 1,69,383.44 కోట్లు కాగా.. ఆర్థిక లోటు అంచనా రూ. 45, 509.60 కోట్లు, మూలధన వ్యయం రూ. 29.046.77 కోట్లు అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాన్ని తనకు కల్పించిన సీఎం కేసీఆర్‌కు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఏడేళ్ల తెలంగాణ అనేక రాష్ట్రాలను ప్రగతిలో అధిగమించిందని..ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. అభివృద్ధిలో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని.. నిర్దేశిత లక్ష్యాలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. సమస్యలు, సవాళ్లు అధిగమిస్తూ ప్రగతి పథాన పయనిసున్నామని..కరోనా వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్నారు. రాష్ట్రంలో కరోనా తీవ్ర ప్రభావం చూపిందని హరీష్‌రావు పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం శాసనసభ శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి. బడ్జెట్‌లో జీఎస్‌డీపీ అంచనా రూ.9,78,373 కోట్లుగాను, తలసరి ఆదాయం అంచనా రూ.2,27,145 కోట్లుగాను మంత్రి అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పెద్దపీట వేసింది. ఆ రంగానికి దాదాపు రూ. 25వేల కోట్లు కేటాయించింది. రైతుబంధు కోసం రూ. 14, 800 కోట్లు కేటాయించగా.. రైతు రుణమాఫీ కోసం రూ. 5, 225కోట్లు.. రైతు బీమా కోసం రూ. 1200 కోట్లు కేటాయించింది. ల÷తు రుణమాఫీ కోసం 5,225 కోట్లు,పశు సంవర్ధక శాఖకు 1730 కోట్లు, సాగునీటి రంగానికి 16,931 కోట్లు, సమగ్ర భూ సర్వే కోసం 400 కోట్లు కేటాయించి వ్యవసాయ రంగంపై శ్రద్ధను మరోమారు చాటుకున్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు.

అన్ని వర్గాల ఆకాంక్షలకు తగ్గట్టుగా బడ్జెట్ ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. ఇందులో సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్‌కు రూ. వెయ్యి కోట్లు.. మూసీ సుందరీకరణకు రూ.200 కోట్లు.. హైదరాబాద్‌లో ఉచిత నీటి సరఫరాకు రూ.250 కోట్లు.. ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణానికి రూ. 100 కోట్లు కేటాయించారు. మెట్రో రైలు కోసం రూ. 1000 కోట్లు.. పురపాలక, పట్టణాభి వృద్ధి అభివృద్ధి కోసం రూ.15, 030 కోట్లు ప్రకటించారు. వైద్య ఆరోగ్య శాఖ కోసం రూ.6295 కోట్లు, పాఠశాల విద్య కోసం రూ.11,735 కోట్లు.. ఉన్నత విద్య కోసం రూ.1873 కోట్లు.. రూ.4 వేల కోట్లతో సరికొత్త విద్యా పథకం ప్రకటించారు. విద్యుత్ రంగానికి 11, 046 కోట్లు.. పరిశ్రమ శాఖ కు రూ.3077 కోట్లు..ఐటీ రంగానికి రూ. 360 కోట్లు, దేవాదాయ శాఖకు రూ. 720 కోట్లు.. హోమ్ శాఖకు రూ.6465 కోట్లు, ఆర్ అండ్ బీ కి రూ. 8,788 కోట్లు.. రిజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణ కోసం రూ.750 కోట్లు, పౌర సరఫరాల శాఖకు రూ.2, 363 కోట్లు కేటాయింపులు చేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.338 కోట్లు..బీసీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు.. గీత కార్మికుల సంక్షేమానికి రూ.25 కోట్లు.. సాంస్కృతిక పర్యాటక రంగానికి 726 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.1502 కోట్లు.. మైనార్టీల సంక్షేమానికి రూ.1606 కోట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి రూ.11వేల కోట్లు కేటాయించారు. పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.29,271 కోట్లు, సాగునీటి రంగానికి రూ.16,931 కోట్లు, ఆసరా పింఛన్లకు రూ.11,728 కోట్లు.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రూ.2,750 కోట్లు కేటాయింపులన ప్రకటించారు. రీజనల్ రింగ్‌రోడ్డు భూ సేకరణకు రూ.750 కోట్లు.. నూతన సచివాలయం నిర్మాణానికి రూ.610 కోట్లు.. పశు సంవర్ధక, మత్స్య శాఖకు 1730 కోట్లు, దేవాదాయశాఖకు రూ.720 కోట్లు.. అటవీ శాఖకు రూ.1,276 కోట్లు.. ఆర్టీసీకి రూ.1500 కోట్లు కేటాయింపు చేశారు. ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం 800 కోట్లు...పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 29,271 కోట్లు కేటాయించారు. ఆసరా పింఛన్ల కోసం 11,728 కోట్లు కేటాయించారు. కలెక్టరేట్లు,జిల్లా పోలీసు కార్యాలయలు, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కోసం 725 కోట్లు కేటాయించారు. ఎస్సీల ప్రత్యేక ప్రగతి నిధి కోసం 21,306.85 కోట్లు,ఎస్టీల ప్రత్యేక ప్రగతి కోసం 12,304.23 కోట్లుగిరిజనుల సంక్షేమం కోసం 338 కోట్లు, బీసీ సంక్షేమ శాఖకు 5522 కోట్లు, పోలీసు స్టేషన్ లలో షి టాయిలెట్ల నిర్మాణం కోసం 20 కోట్ల రూపాయలు, యూనివర్సిటీలలో షి టాయిలెట్స్ నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలు కేటాయించారు. మహిళా,శిశు సంక్షేమం కోసం 1702 కోట్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం 11 వేల కోట్లు, పట్టణాల్లో వైకుంఠధామం నిర్మాణం కోసం 200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం సుంకిశాల వద్ద నిర్మించే తాగునీటి ప్రాజెక్టుకు 725 కోట్లు కేటాయించారు.

దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

-తాజాగా మరో 172మంది మృతి

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా కరోనా పాజిటీవ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

తాజాగా గడిచిన 24 గంటల్లో కొత్తగా 35,871 మందికి కోరోనా నిర్ధారణ కాగా.. 172 మంది మరణించారు. దీంతో భారత్‌లో ఇప్పటి వరకు 1,14,74,605 పాజిటీవ్ కేసులు నమోదుకాగా.. 1,59,216 మంది మృతి చెందారు. ప్రస్తుతం దేశంలో 2,52,364 యాక్టివ్ కేసులు ఉన్నాయని, చికిత్స నుంచి కోలుకుని 1,10,63,025 మంది బాధితులు డిశ్చార్జ్ అయినట్లు గురువారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో పేర్కొంది. కాగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 3,71, 43,255 మందికి కరోనా టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. దేశంలో కొత్తగా 35,871 కేసులు నమోదయ్యాయి. 2,52,364 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. మార్చ్ 14 నాటికి దేశంలో 2.9 కోట్ల మందికి వ్యాక్సీన్ ఇచ్చారు. అందులో 18 శాతం మంది రెండో డోసు కూడా తీసుకున్నారు. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, దిల్లీ లాంటి చిన్న రాష్ట్రాల్లో ప్రతి 10 లక్షల జనాభాకి అత్యధిక శాతం వ్యాక్సీన్లను కూడా ఇచ్చారు. మిగిలిన రాష్ట్రాలు కూడా వ్యాక్సీన్ పక్రియను వేగవంతం చేశాయి. కేరళ, రాజస్థాన్, గోవా ఇప్పటికే ప్రతి 10 లక్షల జనాభాలో 35,000 డోసులు ఇచ్చాయి.

చెరువుల కబ్జాపై హైకోర్టు విచారణ

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): చెరువుల కబ్జాల పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మిస్తున్నారని పిటిషనర్ హైకోర్టుకు తెలిపారు. నోటిఫైడ్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరప వద్దంటూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయవాది శరత్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో చెరువుల కబ్జాపై వేసిన పిటిషన్స్ అన్నింటినీ ఒకేసారి వింటామని ప్రధానన్యాయమూర్తితో కూడిన డివిజన్ బెంచ్ తెలిపింది. హెచ్ఎండీఏ పరిధి ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు వెంటనే ఆపాలని.. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కమిషనర్‌లకు హైకోర్టు ఆదేశించింది.

ఇద్దరు విద్యార్థులకు కరోనా గుర్తింపు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి కి చెందిన ఇద్దరు విద్యార్థులకు కరోన వైరస్ సోకింది. కరోన టెస్ట్ నిర్వహించిన తర్వాత విద్యార్థులను ఉపాధ్యాయులు హోమ్ ఐసోలేషన్‌కు తరలించారు. అయితే ఆ ఇద్దరు విద్యార్థులు ఎవరెవరిని కలిశారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇద్దరు విద్యార్థులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

పోలీస్ శాఖకు పెద్దపీట

-బడ్జెట్‌లో రూ. 6,465 కోట్లు కేటాయింపు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): శాంతి భద్రతలు, పోలీసు శాఖ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. తెలంగాణ పోలీసులు భేషుగ్గా పనిచేస్తున్నారని సిఎం కెసిఆర్ అసెంబ్లీలో కూడా చెప్పారు. తాజాగా బడ్జెట్ లో హోంశాఖకు రూ. 6,465 కోట్లు కేటాయించినట్లు శాసనసభలో ఆర్థిక మంత్రి హరీష్ రావు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీసు వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు, ఫ్రెండ్లీ పోలీసు విధానం అమలయ్యే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. పోలీసు శాఖకు భారీగా నిధులు కేటాయించి, నూతన వాహనాలను, సాంకేతిక సాధనాలను సమకూర్చిందని తెలిపారు. గుడుంబా, పేకాట, గ్యాంబ్లింగ్‌ల నిషేధాన్ని అమలు చేస్తున్నారు. కరోనా కాలంలోనూ పోలీసుశాఖ స్ఫూర్తిదాయకమైన సేవలను అందించింది. అందుకు వారికి అదనంగా ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. బహిరంగ ప్రదేశాల పర్యవేక్షణ కోసం నగర వ్యాప్తంగా 6 లక్షల 65 వేలకు పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఉన్న మొత్తం సీసీ కెమెరాల్లో 65 శాతం తెలంగాణలో ఉన్నాయని మంత్రి హరీష్ రావు తెలిపారు.

సమగ్ర భూసర్వేకు ప్రభుత్వం ప్రాధాన్యం

కెసిఆర్ ప్రకటించిన విధంగానే నిధుల కేటాయింపు

బడ్జెట్‌లో రూ. 400 కోట్లు ప్రతిపాదించిన మంత్రి హరీష్

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): త్వరలోనే రాష్ట్రంలో సమగ్ర భూసర్వే చేపడుతామని సిఎం కెసిఆర్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సమాధానం ఇస్తూ ఈ విషయం చెప్పారు. ఇందుకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ. 400 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి హరీష్ రావు వెల్లడించారు. పక్కాగా భూ రికార్డులు తయారు చేసే లక్ష్యంతో డిజిటల్ విధానంలో సమగ్ర భూ సర్వే జరపాలని ప్రభుత్వం గత సంవత్సరం నిర్ణయించింది. ఈ సర్వే ఆధారంగా అక్షాంశ, రేఖాంశాలతో సహా స్పష్టమైన హద్దుల వివరాలతో పాస్‌బుక్‌లు అందించనున్నామని తెలిపారు. ఈ విధానం వల్ల రికార్డుల వక్రీకరణకు ఎంత మాత్రం అవకాశం ఉండదన్నారు. ఈ సర్వే వల్ల వ్యవసాయ భూముల హద్దులు మాత్రమే కాకుండా, దేవాలయ భూముల, వక్ఫ్ భూముల, అటవీ భూముల, ఇతర ప్రభుత్వ భూముల హద్దుల వివాదాలు కూడా పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రంలో భూరికార్డుల ప్రక్షాళన వల్ల దాదాపు 95 శాతం భూములకు సంబంధించిన యాజమాన్య హక్కులపై స్పష్టత వచ్చిందన్నారు. కొత్త పాస్ పుస్తకాలు రైతులకు అందాయి. ఈ క్రమంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా 60 లక్షల మంది రైతులకు రైతుబంధు సాయం అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. భూరికార్డులను అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రూపొందించిందని తెలిపారు. ధరణి భూపరిపాలనలో నూతన శకానికి నాంది పలికిందన్నారు. ఇప్పటి వరకు ధరణి పోర్టల్‌ను 2 కోట్ల 17 లక్షల మంది వీక్షించినట్లు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 3 లక్షల 29 వేల లావాదేవీలు జరిగాయన్నారు. ఒక లక్షా 6 వేల పెండింగ్ మ్యుటేషన్లు పూర్తయ్యాయని తెలిపారు.

కరోనా కన్నా రోడ్డు ప్రమాదాలవల్లే ఎక్కువగా చనిపోయారు: గడ్కరీ

న్యూఢిల్లీ, మార్చి18: గత ఏడాది కరోనా వైరస్ బారినవారి కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మరణించారని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో గురువారం ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై తమ ప్రభుత్వం దృష్టిపెట్టిందని చెప్పారు. గత ఏడాది దేశవ్యాప్తంగా కరోనా వల్ల 1.46 లక్షల మంది చనిపోగా రోడ్డు ప్రమాదాల్లో 1.5 లక్షల మంది మరణించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 18-35 వయసు గ్రూపు వారే ఎక్కువని చెప్పారు. రోడ్డు ప్రమాదాల గురించి తమ ప్రభుత్వం చాలా ఆందోళన చెందుతున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ టిఆర్ఎస్ ఆధిక్యం

దూసుకు పోతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి, వాణిదేవి

అనూహ్యంగా రెండో స్థానంలో తీన్మార్ మల్లన్న

వెనకబడ్డ బిజెపి అభ్యర్థులు..చిట్టచివరి స్థానంలో కాంగ్రెస్

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ మందకొడిగా సాగుతున్నా.. మూడు రౌండ్లు పూర్తయ్యే సరికి రెండు స్థానాల్లోనూ టిఆర్ఎస్ అభ్యర్థులు మంచి ఆధిక్యంలో ఉన్నారు. ఏ రౌండ్‌లోనూ వెనక్కి తగ్గకుండా లీడ్‌తో దూసుకుని పోతున్నారు. రాత్రికల్లా తుది ఫలితాలు వస్తాయని అనుకుంటున్నారు. టిఆర్ఎస్ అభ్యర్థులు పల్లా రాజేవ్వర రెడ్డి, వాణీదేవిలు ముందంజలు ఉన్నారు. ఏ రైంట్‌లోనూ వీరు వెనక్కి తగ్గలేదు. ఇకపోతే పల్లాకు ఇండింపెండెంట్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గట్టి పోటీ ఇచ్చారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కౌటింగ్ గురువారం కొనసాగుతుంది. మూడో రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తి అయింది. అందులోనూ టిఆర్ఎస్ పార్టీ ఆధిక్యంలో ఉంది. రెండు రౌండ్లలో కలిపి పల్లా రాజేశ్వర్ రెడ్డికి 31,987, తీర్మార్ మల్లన్న 24,116ఓట్లు, కోదండరామ్ కు 18,528 ఓట్లు, బిజెపి ప్రేమేందర్ రెడ్డికి 13,284 ఓట్లు, కాంగ్రెస్ రాములు నాయక్ కు 7,598 ఓట్లు వచ్చాయి. రెండు రౌండ్లలో కలిపి టిఆర్ఎస్ 7,871 ఓట్ల ఆధిక్యం ఉంది. రెండు రౌండ్లలో 6,160 చెల్లని ఓట్లు ఉన్నాయి. రెండో రౌండ్ లో 55,991 ఓట్లు లెక్కించారు. అయితే స్వతంత్ర అభ్యర్తే రెండో స్థానంలో ఉండడం ఇక్కడ విశేషం. కోదండరామ్ మూడో స్థానంలో ఉండగా బిజెపి నాలుగు, కాంగ్రెస్ ఐదోస్థానంలో నిలిచారు. అటు, రంగారెడ్డి-హైదరాబాద్- మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌటింగ్ కొనసాగుతుంది. టిఆర్ఎస్ అభ్యర్థి వాణీదేవి ఆధిక్యంలో ఉన్నారు. ఇక్కడ ప్రస్తుత ఎమ్మెల్సీ రామచందరరావుపై ఆమె ఆధిక్యంలో ఉన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. రెండో రౌండ్ ఫలితాల్లోనూ టీఆర్ఎస్ ఆధిక్యంలో నిలిచింది. టీఆర్ఎస్ అభ్యర్థి సురభివాణి దేవికి 13,395 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి రామచంద్రరావుకు 12,223 ఓట్లు లభించాయి. టీఆర్ఎస్ అభ్యర్థి 1,172 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కొనసాగుతోంది. మొత్తం ఎనిమిది హాళ్లలో ఓట్ల లెక్కింపు చేపడుతుండగా..ఒక్కో హాళ్‌లో ఏడు టేబుళ్లు, ఒక్కో టేబుల్‌లో వెయ్యి ఓట్లు లెక్కిస్తున్నారు. మొత్తం ఏడు రౌండ్లలో లెక్కింపు నిర్వహించనుండగా.. ఒక్కో రౌండ్‌లో 56వేల ఓట్లు కౌంట్ చేయనున్నారు. ఒక్కో రౌండ్‌కు సుమారు నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉంది.

హైదరాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. రెండో రౌండ్ ఫలితాల్లోనూ టీఆర్ఎస్ ఆధిక్యంలో నిలిచింది.

ఆర్థిక ప్రబల శక్తిగా తెలంగాణ అభివృద్ధి

కొత్తగా వెయ్యికోట్లతో సిఎం దళిత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్

మహిళా సంఘాలకు ఈ ఏడాది రూ.3 వేల కోట్లు

కొత్తగా పోలీసు స్టేషన్లు, యూనివర్సిటీల్లో షీ టాయిలెట్ల

బడ్జెట్‌లో ప్రకటించిన ఆర్థికమంత్రి హరీష్ రావు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): ఆర్థికాభివృద్ధిలో దేశంలో తెలంగాణ ప్రబల శక్తిగా ఎదుగుతోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ రావు అన్నారు. మన రాష్ట్ర పురోగతి ఎంతో మెరుగ్గా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దూరదృష్టితో తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టిని చేస్తున్నారని తెలిపారు. అందువల్లే కరోనా సంక్షోభం చుట్టుముట్టినా మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తట్టుకొని నిలబడిందన్నారు.

'దేశ తలసరి ఆదాయం సంవత్సరానికి రూ.1,27,768గా ఉంటుందని అంచనా. ఇది గత సంవత్సరం కంటే -4.8 శాతం తగ్గింది.. అంటే తెలంగాణ తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే రూ.99,377 అధికంగా ఉంది. దీన్నిబట్టి ప్రతికూల పరిస్థితుల్లోనూ మన రాష్ట్ర పురోగతి ఎంతో మెరుగ్గా ఉందని అర్థం చేసుకోవచ్చు. నేడు దేశంలో తెలంగాణ ఒక ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతోందనడానికి ఇది సరైన నిదర్శనం' అని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇకపోతే రాష్ట్రంలోని దళితుల పట్ల సీఎం కేసీఆర్ మరోసారి గొప్ప మనసు చాటుకున్నారు. దళిత అభ్యున్నతికి వరాల వర్షం కురిపించారు. రూ. వెయ్యి కోట్ల నిధులతో సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ అనే పథకాన్ని రూపొందించినట్లు శాసనసభ వేదికగా ఆర్థిక మంత్రి హరీష్ రావు ప్రకటించారు. రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల ప్రజలకు ఈ పథకం ద్వారా పెద్ద ఎత్తున ప్రయోజనాలు కలగనున్నాయని మంత్రి హరీష్ రావు చెప్పారు. ఎస్సీల ప్రత్యేక ప్రగతి నిధి కోసం రూ. 21,306.85 కోట్లు, ఎస్టీల ప్రత్యేక ప్రగతి నిధి కోసం రూ. 12,304. 23 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇకపోతేమహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం ప్రభుత్వం భారీ మొత్తం కేటాయించింది. మహిళా సంఘాలకు ఈ ఏడాది రూ.3 వేల కోట్లు ఇవ్వనుంది. రాష్ట్రంలో మొత్తం 4,29,262 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 46,65,443 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా పొదుపు చేసుకుంటూ బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల రూపంలో బ్యాంకులు రూ.9,803 కోట్లు అందించాయి. వీరంతా క్రమం తప్పకుండా చెల్లిస్తుండటంతో రుణాల రికవరీ రేటు 97

కరోనా సెకండ్ వేవ్ ప్రకంపనలు

నేటినిజం
శుక్రవారం 19-3-2021

దేశంలో కరోనా కేసులు మళ్ళీ పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. సెకండ్ వేవ్ అన్న పదం ఇప్పుడు సర్వత్రా వినిపిస్తోంది. ప్రజలు ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగకుంటే ప్రమాద తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రాలు కూడా ప్రజలను అప్రమత్తం చేయాలి. రోజువారీ పాజిటివ్ కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్న తరుణంలో కేంద్రం అప్రమత్తం అయ్యింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తోంది. గడిచిన 24 గంటల్లో మనదేశంలో 172 మంది కరోనాతో మృతి చెందారు. ఒక వైపు దేశవ్యాప్తంగా వ్యాక్సీన్ కార్యక్రమం కొనసాగుతుండగా మరో వైపు పెరుగుతున్న కోవిడ్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సారి కేసుల పెరుగుదలకు ప్రజల అలసత్వం, నిర్లక్ష్యమే కారణంగా చెప్పుకోవాలి. జాగ్రత్తలు తీసుకోకుండా బయటకు కాలు పెట్టడం వల్ల వారు నష్టపోవడంతో పాటు, ఇతరులను నష్టానికి గురి చేస్తున్నారు. మాస్కు దరించడం, సామాజిక దూరం పాటించడం,శానిటైజన్ ఉపయోగించడం అన్నవి నిత్యకృత్యం కావాలని వైద్యులు చేస్తున్న మెచ్చరికలు చెవికి ఎక్కడం లేదు. ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో మొదలైన వ్యాక్సీన్ కార్యక్రమం నెమ్మదిగా పుంజుకుంటోంది. వ్యాక్సీన్లు ఇవ్వడం పెరిగేకొద్దీ కొత్త కేసులు తగ్గుతాయని భావించారు. కానీ, దీనికి వ్యతిరేక పరిణామం కనిపిస్తోంది.ఒక వైపు వ్యాక్సినేషన్ పక్రియ వేగవంతంగా జరుగుతున్నప్పటికీ, రోజువారీ పెరుగుతున్న కోవిడ్ కేసుల సంఖ్య మాత్రం కలవర పెడుతోంది. చాలా రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. మహారాష్ట్రలో ప్రస్తుతం రోజుకు 13,000 కేసులు నమోదు అవుతున్నాయి. ఇక్కడ జనవరిలో రోజుకు 3000 కేసులకు పడిపోయాయి. జనవరి మొదట్లో రోజుకు 300 కంటే తక్కువ కేసులు నమోదయిన పంజాబ్ లాంటి రాష్ట్రంలో కూడా ఇప్పుడు 1200కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

ఇది జనవరితో పోలిస్తే 5 రెట్లు ఎక్కువ. కరోనా మహమ్మారి మలి విజృంభణ ప్రమాదాన్ని గుర్తించి అప్రమత్తం కావాలని ఇటీవలే ప్రధాని మోడీ మరోమారు రాష్ట్రాల సిఎంలను మెచ్చరించారు. కరోనా విషయంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అప్రమత్త మైనప్పటికీ, ప్రధాని రంగంలోకి దిగడం చూస్తుంటే సమస్య తీవ్రతను గుర్తించాలి. ఆత్మవిశ్వాసం అతివిశ్వాసంగా మారకూడదని హెచ్చరికా చేశారు. సత్వర నిర్ణయాలతో కరోనా దూకుడుకు ముకుతాడు వేయమని హితోపదేశం చేశారు. గత ఏడాది కాలంగా కరోనాతో పోరాడుతున్న వేళ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన సమయంలో కూడా కేసుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం మానవ తప్పిదం కాక మరోటి కాదు. ప్రజలు తమ జీవితావసరాల కోసం బయటకు రకా తప్పడం లేదు. అయితే అదే సమయంలో జాగ్రత్తలు పాటించక పోవడం వల్లనే ఇది ముప్పుగా పరిణమిస్తోంది. కొద్దికాలంగా మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లో కరోనా కేసులు వరుసపెట్టి హెచ్చుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలు అప్రమత్తం కావాలి. అత్యధికుల్లో యాంటీజెన్ పరీక్షకు వైరస్ దొరకడం లేదన్న అనుమానాలు ఉన్నందున , తాము చేసే టెస్టుల్లో 70శాతానికి పైగా ఆర్టీపీసీఆర్ పరీక్షలే ఉండేలా చూసుకోవాలని ప్రధాని సూచించారు. ఏడాది క్రితం పరిస్థితులతో పోల్చితే ఇప్పుడు పరికరాల ఖరీదు కూడా బాగా తగ్గినందున దాని కచ్చితత్వం దృష్ట్యా ఏ మాత్రం వెనుకాడనక్కరలేదు. ప్రధాని అన్నట్టుగా టీకా కేంద్రాల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉన్నది. దీర్ఘకాలంలో వైరస్‌కు వ్యతిరేకంగా మందబలాన్ని సముపార్జించిపెట్టేది వాక్సిన్ ఒక్కటే కనుక మరిన్ని కేంద్రాలు తెరవడం అవసరమే. వాక్సిన్ కొరత లేకుండా చూస్తున్నారు. దీంతో పాటు వాక్సిన్ మీద ఇప్పటివరకూ ఉన్న నియంత్రణలను కూడా ఎత్తేస్తే మంచిది. అలాగే వయో నిబంధనలు, రోగాల జాబితాలు ఎత్తివేసి, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటిలోనూ వాక్సిన్ విరివిగా లభించేలా చేయాలి. కనీసం ముప్పయ్యేళ్ళుదాటిన

వారంతా వాక్సిన్ వేయించుకోగలిగే అవకాశం కల్పిస్తే హెర్డ్ ఇమ్యూనిటీ మీద నమ్మకాలు పెట్టుకోవచ్చు. కరోనా వ్యాక్సిన్ ఎక్కడికీ పోలేదు, అది మన మధ్యనే నివురుగప్పిన నిప్పులా ఉన్నమాట నిజం. పరీక్షలు పెంచితే, కరోనా వ్యాప్తి కూడా బయటపడుతుంది. కరోనా మీద విజయం సాధించామనీ పాలకులు గొప్పలకు పోతుంటే, దాని పీడ పూర్తిగా తొలగిపోయిందని ప్రజలు భ్రమపడుతున్న వేళ నేరనెక్కడికీ పోలేదని కరోనా మనలను మెచ్చరిస్తోంది. కరోనాతో సహజీవనం తప్పదంటూ మాల్స్ నుంచి స్కూళ్ళ వరకూ అన్నీ తెరిచి, బస్సులూ రైళ్ళ రాకపోకలు అనుమతించి, వేడుకలమీద ఆంక్షలు ఎత్తివేసిన తరువాతనే వైరస్ మరింతగా వ్యాప్తి చెందిందని గుర్తించాలి. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవాలంటూ లాక్‌డౌన్ తెరలు తొలగించాక పాలకులు ప్రజలను వారి ఖర్మానికి వదిలేశారు. దీంతో వీరూ మాస్కులూ, సామాజిక దూరాలూ మరిచిపోయారు. గతంలో ఉన్నదానికీ లేనిదానికీ అనవసరంగా భయపడినవారు ఇప్పుడు రోగం విషయంలో ఊహకు అందనంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కరోనా వ్యాప్తి పెద్దగా లేని కాలంలో ప్రజలపై అవసరం లేకున్నా లాఠీలతో విరుచుకుపడిన పాలకులు ఇప్పుడు తప్పంతా ప్రజలదే అన్నట్టుగా మాట్లాడటంలో అర్థంలేదు. కరోనా కారణంగా ప్రపంచం స్తంభించిన అనుభవాలు చూశాం. ఎలాంటి లావాదేవీలు జరగని రోజులు ఉన్నాయి. ప్రపంచం ఇంతగా కంపించి పోయిన ఘటన బహుశా ఇదే మొదటి సారి కావచ్చు. ప్రపంచాన్ని గడగడలాడించే కిరాతకులు సైతం కరోనాకు జంకుతున్నారంటే దాని వైపరీత్యాన్ని అర్థం చేసుకోవాలి. ఈ క్రమంలో ఇంకా మనం నిర్లక్ష్యంగా ఉంటూ గతాన్ని కొనసాగించాలన్న అలసక్ష్యంతో ఉండరాదు. ఎవరికి వారు ప్రమాద జాగ్రత్తలను తీసుకోవాల్సిందే. అప్పుడే సెకంట్‌వేవ్ ఆగిపోతుంది. కంట్రోల్ అన్నది మన చేతుల్లోనే ఉందని గుర్తించి ప్రజలే అప్రమత్తంగా ఉంటే తప్ప కరోనాను తరిమికొట్టలేము.

బడ్జెట్ మొత్తం అంకెల గారడీ

-కేటాయింపుల్లో సమతూకం లేదన్న బిజెపి నేతలు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): మామ మాటలకు అల్లుడి భజన సరిపోయిందని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. బడ్జెట్ అంకెల గారడి తప్ప ఏమీ లేదన్నారు. గల్ఫ్ కార్మికులకు బడ్జెట్ కేటాయింపులు దారుణమన్నారు. ఉద్యమానికి కీలక పనిచేసిన ఓయూ, కేయూలకు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. ఏపీ ఎప్పుడో పీఆర్సీ ఇస్తే..ఇక్కడ పీఆర్సీ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతిపై కూడా పైసా ఇవ్వలేదన్నారు. ఎన్నికల వేళ మాట్లాడిన మాటలు ఇప్పుడు మాట్లాడటం లేదన్నారు. తమకు సభలో మాట్లాడే టైం ఇవ్వడం లేదన్నారు. మొత్తంగా బడ్జెట్ మేడిపండు చందంగా ఉందని రఘునందన్ రావుమ ఎద్దేవా చేశారు. గురువారం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ..ఈ బడ్జెట్ చూస్తే కళ్లు తిరిగి కింద పడాల్సిందేనని సెటైర్ వేశారు. గల్ఫ్ కార్మికుల కోసం 500 కోట్లు కేటాయిస్తామన్నారు.. 2014 నుంచి ఇదే మాట చెబుతూ వస్తున్నారని రఘునందన్‌రావు అన్నారు. బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే పుస్తకాలకే పరిమితం..అమలు చేయరని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. మూసీ నదికి కేటాయించిన కోట్లు ఎటుపోయాయి? అని ప్రశ్నించారు. క్రీడా రంగానికి ఒక్క రూపాయి కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌గా తయారైందని రాజాసింగ్ అన్నారు. క్రీడా రంగానికి ఒక్క రూపాయి కేటాయించలేదని సీరియస్ అయ్యారు. హెల్త్ కోసం భారీగానే కేటాయింపులు చేశారన్నారు. కానీ అవి ఎక్కడ ఖర్చుచేస్తారో చూడాలన్నారు. ఉస్మానియా హాస్పిటల్ కట్టడానికి వందల కోట్లు ఖర్చు

చేస్తామన్నారు. రూపాయి కూడా ఖర్చు చేయలేదు. మూసీ సుందరీకరణ కోసం.. కోట్లు ఖర్చు చేస్తాం అన్నారు. ఇప్పటికీ అవి ఖర్చుచేయలేదన్నారు. నగరంలోని దూల్ పేటలో గుడుంబా నివారణ చేసి.. వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఎవ్వరికీ ఉపాధి కల్పించలేదన్నారు. తెలంగాణ ప్రజలు సమావేశాలను సీరియస్ గా చూస్తున్నారరి గుర్తుంచుకోవాలని రాజాసింగ్ అన్నారు.

గుట్కా దందాతో అక్రమ సంపాదన

-దాడులు చేస్తున్నా దారికిరాని వ్యవహారం

నిజామాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ గుట్క వ్యాపారాన్ని కొందరు రాజకీయ నేతల అండతో గుట్టుగా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో గుట్కా వ్యాపారాన్ని నేతల అండదండలతో జరిగేదని, అయితే పోలీసు శాఖ సీరియస్‌గా ఉండడం వల్ల గుట్కా వ్యాపారంపై దాడులు చేసింది. ఈ దాడుల్లో లక్షల రూపాయల గుట్కాను స్వాధీనం చే సుకుని పలువురిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో గుట్కాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకుని గుట్కా వ్యాపారంపై నిఘా పెట్టి ఖచ్చితమైన సమాచారంతో దాడులు నిర్వహించింది. అయితే మహారాష్ట్ర నుంచి తీసుకుని వచ్చి ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకుని దానిని రవాణ చేస్తున్న వారిని అదుపులోకి చేసుకుని వారిపై కేసులు సమోదు చేస్తున్నా, వ్యాపారాలు ఆగడం లేదు. దీంతో గతంలో ఈ వ్యాపారం చేసిన వారు మానివేయడంతో దీనిని తిరిగి మరి కొందరు వ్యక్తులు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో తయారవుతున్న వివిధ రకాల గుట్కాను అక్రమ మార్గాన రవాణ చేస్తున్నారని సమాచారం. పోలీసుల కళ్లుకప్పి కొందరు అక్రమార్కులు ఈ వ్యాపారాలను సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రహస్య ప్రదేశాల్లో నిలువ చేసి చిల్లర వర్తకులకు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఇ టీవల భారీ ఎ త్తున గుట్కా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. కొంతకాలంగా కొందరు వ్యక్తులను ముందు పెట్టి ఓ నేత వెనుక ఉండి చక్రం తిప్పుతూ ఈ వ్యాపారం జరిపిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యాపారం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు సమాచారం. అయితే గుట్కాను రవాణ చేసిన సమయంలో పట్టుపడ్డ వారు మాత్రం అసలు సూత్రధారుల పేర్లను బయట పెట్టడడం లేదని తెలుస్తోంది.

అద్దెలు చెల్లించలేక అంగన్‌వాడీల అవస్థలు

ఖమ్మం,మార్చి18(ఆర్ఎన్ఎ): అంగన్‌వాడీ కేంద్రాల అద్దె చెల్లింపులు ప్రహసనంగా మారింది. ప్రభుత్వం ప్రతినెలా అద్దె చెల్లింపు సొమ్మును టీచర్లకు చెల్లించడం లేదు. దీంతో టీచర్లు అద్దె చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీసుకున్న భవనాలలో గదుల సంఖ్యను బట్టి ప్రభుత్వం అద్దెను చెల్లిస్తుంది. ప్రభుత్వం ఇచ్చే అరకొర అద్దెకు గ్రామాలలో ఎక్కడా భవనాలు దొరికే పరిస్థితి లేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు సొంతంగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇచ్చే అద్దె గిట్టుబాటు కాక గృహ యజమానులు భవనాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. దీంతో కేంద్రాలను నిర్వహించాల్సిన బాధ్యత టీచర్లపై ఉండడంతో తమ సొంత సొమ్మును కొంత కలిపి యజమానులకు అద్దె రూపంలో చెల్లిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా సెప్టెంబర్ నుంచి ప్రభుత్వం అద్దె బిల్లులను చెల్లించడం లేదు. దీంతో యజమానులు భవనాలను ఖాళీ చేయాలని టీచర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిని తట్టుకోలేక

కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు అప్పు చేసి మరీ చెల్లిస్తున్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేసి తమ ఇబ్బందులను తొలిగించాలని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణకు శాశ్వత భవనాలను నిర్మించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు. అద్దె భవనాలు కావడంతో అంగన్‌వాడీ కేంద్రాలు జిల్లాలో మౌలిక వసతులు లేక నిరుపయోగమవుతున్నాయి. సొంత భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కాలం వెల్లదీస్తున్నాయి. సొంత భవనాలు గల అంగన్‌వాడీ కేంద్రాలు సైతం మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాయి. నిరుపయోగంగా పడి ఉన్న మరుగుదొడ్లు ఈ కేంద్రాలలో దర్శన మిస్తున్నాయి. సరైన ఆట స్థలాలు లేక చిన్నారులు ఆట, పాటలకు దూరమవుతున్నారు. ఇరుకు గదుల్లో కేంద్రాలను నిర్వహిస్తుండడం అసౌకర్యంగా మారింది.

మళ్లీ కరోనా విస్తరిస్తే కష్టాలే

ఆర్థిక పరిస్థితులు దిగజారుతాయంటున్న నిపుణులు
కరోనా విస్తరణను అడ్డుకోవాలని హెచ్చరికలు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): గతంలో విదేశాల నుంచి వచ్చిన వారి ద్వారా కరోనా వ్యాప్తిం చెందిందని భయపడ్డాం. కానీ ఇప్పుడు మనం విచ్చలవిడిగా ప్రయాణాలు చేయడం వల్లనే వ్యాప్తి జరుగుతోందని తెలుసుకోవాలి. ఎయిర్‌పోర్టులు దాదాపు మూతపడ్డాయా అన్నంతగా ఉన్నాయి. వ్యాపార సంస్థల కార్యకలాపాలు ఇంకా పూర్తిస్తాయిలో సాగడం లేదు. దీంతో ఆర్థిక రంగంపై మళ్లీ ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కొననచోట్ల లాక్‌డౌన్‌లు, కర్ఫ్యూలు విధించడంతో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించనున్నాయి. ఇలాంటి పరిస్తితి వస్తే మళ్లీ కోలుకోవడం కష్టమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చివరకు ఆస్పత్రులకు వచ్చే రోగులు కూడా ఇంటిపట్టునే ఉంటున్న దౌర్భాగ్యం నేడు ప్రపంచం కళ్ల ముందు కదలాడుతోంది. అయినా భారత్‌లో కరోనా విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. కలసికట్టుగా పోరాడితే తిరిగి సాధారణ స్థితి నెలకొంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. వ్యాధి లేదా వైరస్ విస్తరించకుండా ఇప్పుడు తీసుకుంటున్న చర్యలు భేషుగ్గానే ఉన్నాయి. మానవ సంచారం ఎంతగా సాగితే వైరస్ అంతగా విజృంభిస్తుంది. అయితే ఎంతకాలం ఇలా మనిషి కాలు బయటపెట్టకుండా ఉండాలన్న దానికి సమాధానం దొరకడం లేదు. ఇప్పుడు అసలే పరీక్షల సీజన్ కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితులు సాధారణంగా ఉంటేనే పిల్లలు స్కూళ్లకు వెళ్లే అవకాశం ఉంటుంది. కరోనా సోకిన వారిని రక్షించేందుకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా శ్రమిస్తున్న డాక్టర్ల ధైర్యాన్ని మనమంతా పొగడాల్సిందే. వారిని అభినందించాల్సందే. అలాగే, ఆరోగ్య సంస్థల సూచనలు, పరిశుభ్రత పాటించాల్సి న అసవరం ఉంది. కరోనా వైరస్ వ్యాప్తి భయంతో దేశ ఆర్థిక రాజధాని నగరమైన ముంబైలో మళ్లీ పరిస్తితులు ఆందోళనకరంగా మారాయి. పాఠశాలలు, సినిమా థియేటర్లు, జిమ్‌లు, షాపింగ్ మాల్స్ ఇంకా పూర్తిస్తాయిలో అందుబాటులోకి రాలేదు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించేందుకు పలు కార్పొరేట్ కార్యాలయాల్లో తమ ఉద్యోగులను ఇంకా ఇంటి నుంచే పనిచేసేలా చేస్తున్నాయి. యాలని ఆదేశాలు జారీ చేశారు. కట్టుదిట్టమైన చర్యలతో ఏడాదిగా కృషి చేస్తున్నా మహమ్మారి కరోనా వ్యాప్తి దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతోంది. కోవిడ్ కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ఆ దిశగా అడుగులు సమర్థవంతంగా వేయడంలేదని తెలుస్తోంది. ఇక వైరస్ బారినపడినవారికి చికిత్స అందించడం ఎంత ముఖ్యమో.. అనుమానితులను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం అంతకంటే ముఖ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. లేదంటే వైరస్ వ్యాప్తి మనుషుల మధ్య తీవ్రమై కోలుకోలేని నష్టాన్ని మిగుల్చుతుందని హెచ్చరించారు. కరోనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న వసతులను పెంచాల్సి ఉంది. ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా వైరస్ అన్ని రంగాల పరిశ్రమల పై తీవ్ర ప్రభావం చూపడంతో జరిగిన ఆర్థిక నష్టాన్ని మనం భరిస్తున్నాం. కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో పరిశ్రమ వర్గం ఆందోళన చెందుతోంది. సెకండ్‌వేవ్ ప్రచారంతో ఇప్పుడు ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కరచాలనం మానేశారు. మాస్కులు ధరిస్తున్నారు. ఎక్కువ మంది గుమికూడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని నిపుణులు చేసిన సూచన పాటిస్తున్నారు. ఎగుమతులు తగ్గుతున్న క్రమంలో పరిశ్రల్లో పనిచేస్తున్న కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కొండగట్టులో ఏటా తాగునీటి ఎద్దడి

వేసవిలో మరింత తీవ్రం కానున్న సమస్య

జగిత్యాల,మార్చి18(ఆర్ఎన్ఎ): కొండపైన తాగునీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. యేటా హనుమాన్ జయంత్యుత్సవాలకు ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించాల్సిన పరిస్థితి ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు చేద్దామంటే మురికి నీరు ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతు న్నారు. రెండవ కోనేరును నిర్మించినా నీరు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. శాశ్వత పరిష్కారం కోసం సంతల లొద్ది నుంచి నీటిని కొండపైకి తరలించాలని ప్రతిపాదనలు ఉన్నా నిధుల లేమితో వెనుకడుగు వేస్తున్నారు. ఎండాకాలంలోనైతే భక్తులు కొండపై కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండాపోతుంది. ఆలయం చుట్టూ షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మూత్ర శాలలు, స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే మల విసర్జనతో పాటు స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎండాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రం అవుతోంది. కొండగట్టు అంజన్న దేవాలయ ంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఇక్కడికి వస్తున్న భక్తులు ఆరోపిస్తున్నారు. యేటా భక్తులు పెరుగుతున్నా సౌకర్యాలు మెరుగుపడటం లేదు. యేటా లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడే ఆలయం వద్ద భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు లేకపోవడంతో పాటు బస చేసేందుకు కనీస సౌకర్యాలు లేవు. దీక్షాపరులు నానా అగచాట్లు పడుతుం టారు. భక్తుల సౌకర్యార్థం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆలయ అధికారులు రూ.15 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా బుట్ట దాఖలయ్యాయి. కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానంలో రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్ కాగితాలకే పరిమితమైంది. కొండపై వెలసిన ఆంజనేయ స్వామి దేవస్థానానికి దాదాపు 500 ఏళ్ల చరిత్ర ఉంది. నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. యేటా ఇక్కడ చైత్ర పౌర్ణమి రోజున చిన్న హనుమాన్ జయంతి, పూర్వాభాద్ర నక్షత్ర, వైశాఖ బహుళ దశమి రోజున పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ రెండు జయంతిలకు కొండగట్టుకు దాదాపు 6 లక్షల మంది దీక్షాపరులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మాల విరమణ చేస్తారు. చిన్న హనుమాన్ జయంతి ఐదు రోజుల పాటు జరుగుతుండగా, 3.50 లక్షల మంది దీక్షాపరులు కొండపైకి వస్తుంటారు. పెద్ద హనుమాన్ జయంతి మూడు రోజుల పాటు జరుగుతుండగా, 2.50 లక్షల మందికి పైగానే భక్తులు వస్తుం టారు. దీనికి తోడు ప్రతి మంగళవారం, శనివారం భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. శ్రావణ మాసంలో భక్తుల తాకిడి చెప్పనలవి కాదు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని నాయకులు పేర్కొని ఆరేళ్లు అవుతున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. యేటా ఈ ఆలయానికి రూ.20 కోట్ల మేరకు ఆదాయం వస్తుందని అంచనా. ఆదాయం కూడా భారీగానే వస్తున్నా సర్కారు మాత్రం అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయడం లేదు. రూ.100 కోట్లతో కొండపైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు గతంలో ప్రతిపాదనలు కూడా తయారు చేశారు. కొండపైన ప్రధాన సమస్య వసతి గృహాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రాత్రి పూట బస చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు. కొండగట్టుపైకి మరో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రతిపాదనలు కూడా తయారు చేశారు. అధికారులు, నాయకులు హడావిడి చేసి ఆరేడు మాసాలవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. దీంతో కొండగట్టు అంటేనే భక్తులు భయపడాల్సిన పరిస్థితి వస్తుంది.

రాజీవ్ స్వగృహ కోసం ఉద్యోగుల చూపు

కేటాయించాలని కోరుతున్న సంఘాల నేతలు

ఖమ్మం,మార్చి18(ఆర్ఎన్ఎ): నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను తమకు కేటాయించాలని పలు ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. అలాగే జర్నలిస్ట్ సంఘాలుకూడా ఆసక్తిగా ఉన్నాయి. దశాబ్దకాలం తర్వాత రాజీవ్ స్వగృహ ప్లాట్లకు కదలిక వచ్చినా ఖమ్మం రాజీవ్ స్వగృహకు మాత్రం మోక్షం లభించడం లేదు. దీంతో కోట్లాది రూపాయలు భవన సముదాయాలు నిరుపయోగంగా ఉండడంతోపాటు చెత్తా చెదారంతో అసంపూర్తిగా శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకున్న పలు రాజీవ్ స్వగృహ సముదాయాలను ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులకు విడివిడిగా ప్లాట్ల వారీగా విక్రయించేందుకు బహిరంగ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10వేల రాజీవ్ స్వగృహ ఎ÷-లాట్లను విక్రయించాలని భావిస్తోంది. ఇలా కట్టిన ఇళ్లు, ఖాళీస్థలాలను కూడా వేలంలో అమ్మి సొమ్ములు చేసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.ఖమ్మం రాజీవ్ స్వగృహ ప్లాట్లు వేలం పెడితే పలువురు ఆసక్తి చూపుతున్నా... జిల్లా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ రాజీవ్‌స్వగృహ సమస్యను పట్టించుకోలేక పోతున్నారు. ప్రభుత్వ సొమ్మే కదా మనకేంటి అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీంతో ఖమ్మం రాజీవ్‌స్వగృహ ప్లాట్ల విషయం ఎటూ తేల్చలేకపోతురన్నారు. ఉద్యోగులు, అధికారులు, మధ్యతరగతి వర్గాలకు సైతం పక్కా ఇల్లు కల నెరవేర్చాలని దశాబ్దకాలం క్రితం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రాజీవ్ స్వగృహ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ.60కోట్లతో ఖమ్మం జిల్లా పోలేపల్లిలో భవనాలు నిర్మించింది.వివిధ ప్రాంతాల్లోని రాజీవ్ స్వగృహ ప్లాట్లను, ఖాళీస్థలాలను అమ్మేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయికమిటీని కూడా నియమించింది. అయితే ఈ వేలం వేసే జాబితాలో ఖమ్మంలోని రాజీవ్ స్వగృహ సముదాయం లేకపోవడంతో ఈ ప్లాట్లను అమ్ముతారా? లేక అలాగే ఉంచుతారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీటిని నిర్మించి పూర్తిచేసి ఇస్తే తీసుకుంటామని ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తమ సంఘాల ద్వారా విన్నవించుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏజెన్సీ ఏరియాలో ఉండడంతో ఖమ్మంలోనే అందరికీ అపార్టుమెంట్లతోపాటు వ్యక్తిగత ఇళ్లు నిర్మించి ఇస్తామని దరఖాస్తులు తీసుకున్నారు. వేలసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే కొందరు మాత్రమే డిపాజిట్లు చెల్లించారు. రాజీవ్ స్వగృహ ధరలు అధికంగా ఉన్నాయని భావించి వాటిని తీసుకోవడానికి ఇష్ట పడలేదు. క్రమంగా ధరలు పెరగడంతో డబుల్‌బెడ్‌రూంధర ప్రైవేటుగా రూ.20నుంచి 30లక్షలు పలుకుతుంది. దీంతో రాజీవ్ స్వగృహ ఇళ్లపై అందరి దృష్టిపడింది. ఖమ్మంలో నిరుపయోగంగా ఉంటున్న రాజీవ్‌స్వగృహ అపార్టుమెంట్లు, స్థలం తమకు కేటాయిస్తే డబ్బులు చెల్లిస్తామని తెలంగాణ గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టు సంఘాలు కూడా ప్రభుత్వానికి విన్నవించాయి. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు.

తీవ్రం అవుతున్న వేసవి ఎండలు

మంచి నీటి కోసం ప్రజల ఆందోళన

కాగజ్‌నగర్,మార్చి18(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని గ్రామాలకు నీటిని అందించాలన్న లక్ష్యంతో కొత్త ఊ

కడప కార్పొరేషన్ మేయర్‌గా కె.సురేష్ బాబు

డిప్యూటీ మేయర్‌గా సయ్యద్ ముంతాజ్ బేగం ఎన్నిక

మైదుకూరులోనూ వైకాపా పాగా

కడప,మార్చి18(ఆర్ఎన్ఎ): కడప కార్పొరేషన్ మేయర్‌గా కె.సురేష్ బాబు, డిప్యూటీ మేయర్‌గా సయ్యద్ ముంతాజ్ బేగం ఎన్నికయ్యారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశం హాలులో గురువారం ఉదయం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగింది. నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి.హరికిరణ్ ప్రారంభించారు. . డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజద్ భాష, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డిలు వైఎస్సార్ అఫిషియో హోదాలో ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు పరిశ్రమల అభివద్ధి సలహాదారు రాజోలి వీరారెడ్డి, మునిసిపల్ కమిషనర్ లవన్న, తహసీల్దార్ శివరామి రెడ్డి, నగరపాలక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. మైదుకూరు మున్సిపాలిటీలో 24 వార్డులుండగా, టీడీపీ 12 వార్డుల్లో, వైసీపీ 11 వార్డుల్లో , జనసేన ఒక చోట గెలుపొందాయి. దీంతో ఏ పార్టీకి కూడా మెజార్టీ దక్కని పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులతో కలుపుకుంటే వైసీపీ బలం 13కి పెరిగింది. టీడీపీ, జనసేన కలిస్తే సంఖ్యా బలం 13గా ఉంది. కాగా, టీడీపీ ఆరో వార్డు సభ్యురాలు మహబూబ్‌బీతో పాటు జనసేన సభ్యుడు బాబు గైర్హాజరు కావడంతో టీడీపీ బలం 11కి పడిపోయింది. మరోవైపు అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ తమకున్న రెండు ఎక్స్ అఫీషియా ఓట్లతో బలాన్ని

13కి పెంచుకుని చైర్మన్ పీఠాన్ని చేజిక్కించుకుంది. మైదుకూరు మున్సిపల్ ఛైర్మన్‌గా మాచనూరి చంద్ర, వైస్ ఛైర్మన్‌గా మహబూబ్ షరీఫ్ ఎన్నికయ్యారు.

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా జెసి ప్రభాకర్ రెడ్డి

వైస్ ఛైర్‌పర్సన్‌గా సరస్వతి ఎన్నిక

అభివృద్ధి కోసం సిఎం జగన్‌ను కలుస్తానన్న జెసి

అనంతపురం,మార్చి18(ఆర్ఎన్ఎ): తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఉత్కంఠకు తెరపడింది. అనూహ్య పరిణామాల మధ్య ఈ మున్సిపాలిటీ టీడీపీ వశం అయింది. మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీ కౌన్సిలర్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా సరస్వతిని ఎన్నుకున్నారు. టీడీపీకి ఉన్న 18 మంది కౌన్సిలర్ల బలానికి తోడు సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు మద్దతు ఇవ్వడంతో ప్రభాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మూడు రోజుల కిందట ఎమ్మెల్సీల ఎక్స్‌అఫీషియో ఓట్లను మున్సిపల్ కమిషనర్ తిరస్కరించిన నాటి నుంచి ఈ ఛైర్మన్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎన్నికతో దీనికి తెరపడింది. ఇక తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అవసరమైతే సీఎం జగన్ ను కలుస్తానని, సేవ్ తాడిపత్రి నినాదంతో ముందుకు వెళతనాని అన్నారు. మున్సిపాలిటీని నెంబర్ వన్ చేసి చూపిస్తానని నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటానని అన్నారు. అధికారులు అంతా న్యాయబద్ధంగా వ్యవహరించారని చెప్పుకొచ్చారు.

రెండో రోజు కాంగ్రెస్ నాయకుల అరెస్టు

రాజన్న సిరిసిల్లా, మార్చి 18 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో రెండో రోజు కాంగ్రెస్ నాయకులను బుధవారం అర్ధరాత్రి 3 గంటలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు . దీంతో టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీల నాయకుల చూస్తే తే భయ మొదలైందని తెలుస్తుందని వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ వెంకటస్వామి తెలిపారు . భయంతోనే కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధంగా భావిస్తూ రాబోయే రోజులలో టిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టే పరిస్థితి చూస్తారని ప్రజలు ఆలోచన చేస్తున్నారన్నారు . కే . చంద్రశేఖర్ , చిలక రమేష్ , మధు , ఎంపిటిసి రాజశేఖర్ , నాగుల విష్ణు , సర్పంచ్ రాజ ప్రకాష్ , ప్రశాంత్ , రాజేష్ , రాము , రాజు అరెస్టు చేసిన దాంట్లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు .

బడ్జెట్ అంకెలతో ప్రజలకు బురిడీ

కరోనాతో ఆదాయం పడిపోతే ఇదెలా సాధ్యం

మండిపడ్డ సిఎల్పీ నేత భట్టి విక్రమార్క

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం బడ్జెట్ అంకెల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ..కరోనా వల్ల ఇబ్బందులు పడుతూనే 2,30,825 కోట్ల బడ్జెట్ ఎలా ప్రవేశపెడతారని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికే మూడున్నర లక్షల కోట్లు అప్పు ఉందని చెప్పారు.ఈ ఏడాది ఆర్థికలోటు 45,509 కోట్లు చూపించారని మండిపడ్డారు. అప్పుల భారాన్ని భారీగా పెంచుతున్నారని ధ్వజమెత్తారు.

సామాన్యులకు మేలు చేయట్లేదని చెప్పారు. గతసారి లక్షా 43 వేల కోట్లు బడ్జెట్ చేరలేదని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, మూడెకరాల భూమి, ఉద్యోగాలు లేవని చెప్పారు. ప్రజలను మోసం చేసేవిధంగా బడ్జెట్ ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేయకపోవడం వల్ల వడ్డీ భారం పెరిగిందని, కొత్తగా రుణాలు ఇవ్వడం లేదని, రైతులు ప్రైవేటుగా అప్పులు తెచ్చి రుణాలు, వడ్డీ చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం అమ్మకాలు, అప్పులు తెచ్చుకునే అంశాల్లోనే రాష్ట్రం పురోగతి సాధించిందని భట్టివిక్రమార్క ఎద్దేవా చేశారు. రీ డిజైన్ చేయకుండా పాత ప్రాజెక్టులను కొనసాగిస్తే రూ.32 వేల కోట్లతోనే పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవన్నారు.

మండలిలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన మంత్రి వేముల

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్ రావు వార్షిక బ్జడెట్ ప్రవేశ పెట్టారు.

అలాగే శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి ప్రశాంత్‌రెడ్డి బ్జడెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్రం ఏర్పడిన నాడు పరిస్థితి అస్పష్టంగా, గందరగోళంగా ఉందన్నారు. అన్నిరంగాలలో వెనుకబడి ఉందని, టీఆర్ఎస్ ప్రభుత్వం అస్పష్టతలను చేధిస్తూ.. కొత్త రాష్ట్రానికి తగిన విధానాలను అవలంభిస్తూ అభివృద్ధివైపు వేగంగా అడుగులు వేసిందన్నారు.

తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణమైన పంథాలో ఆర్థిక ప్రణాళికలను రూపొందించిందన్నారు. నిర్దేశిరచుకున్న లక్ష్యాలను ఆశించిన సమయంలోనే సాధించిందని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకు ముందు బడ్జెట్ ప్రతులను మంత్రి హరీష్ రావు,మంత్రి వేముల కలసి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి అందచేశారు.

చంద్రబాబు నిజాయితీని నిరూపించుకోవాలి !

హైదరాబాద్, మార్చి 18: అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి అక్రమాలపై భారతదేశంలో విచారణలు జరగడం లేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు తమకు ముందున్న ప్రభుత్వాల నిర్ణయాలు అక్రమమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఎందుకంటే వీరు రాగానే చేసే పనులు కూడా అదే కోవలో ఉంటున్నాయి గనుక. దీంతో లోపాయకారి అండర్ స్టాండింగ్ రాజకీయపార్టీల మధ్య ఉందా అన్న అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే పాలనలో అక్రమాలు చేస్తున్న పార్టీల నేతలు ..తాము దిగిపోతే విచారణకు గురికావాల్సి వస్తుందన్న భయం లేకుండా పోయింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే కెసిఆర్ గత పాలకుల అక్రమాలపై కొరడా ఝుళిపిస్తానని ప్రకటించి తుస్సుమనిపించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, నయీమ్ డైరీ, అక్రమాస్తులపై విచారణలను తుంగలో తొక్కారు. ఇకపోతే తానే అనేక కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడ్డట్లు వస్తున్న ఆరోపణలను కూడా పెద్దగా లెక్క చేయడం లేదు. ఎపిలో జగన్ కూడా అనేక అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చారు. కానీ కేంద్రం లేదా, ఆనాటి సిఎం చంద్రబాబు కూడా పెద్దగా పట్టించుకోకుండా వదిలేశారు. తాజాగా ఇప్పుడు చంద్రబాబు నాయుడు అమరావతి భూముల విషయంలో సిఐడి విచారణకు సిద్ధం కావాల్సి వచ్చింది. నిజంగానే ఏ పనిలో అయినా అక్రమాలు జరిగితే విచారణ చేయాల్సిందే. అవినీతి జరిగితే నిలదీయాల్సిందే. కేసుల పెట్టాల్సిందే. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డ నేతలను ఊచలు లెక్కించేలా చేస్తే తదుపరి వచ్చే పాలకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రజసంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెడతారు. ఇప్పుడు చంద్రబాబు కూడా సిఐడి విచారణను ఎదుర్కొని తన సచ్చీలతను నిరూపించు కోవాలి. అయితే మునిసిపల్ ఎన్నిక ఫలితాల్లో వైసీపీ ఏకపక్ష విజయం సాధించింది. ఈ హడావుడి ముగియక ముందే ప్రతిపక్షనేత, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఎపి సిఐడి నోటీసులు ఇవ్వడం రాజకీయంగా కొంత కలకలం మొదలైంది. ఇది యాదృచ్ఛికంఅనుకోవడానికి లేదు.

కావాలని చేసిన పనిగానే చూడాలి. ఒకవేళ అలా చేసినా అందులో అక్రమాలు జరిగి వుంటే నిగ్గదీయాల్సిందే. ఎన్నికల ఫలితాలను మూడు రాజధానులకు ఆమోదంగా చెబుతున్న అధికార వైసీపీ ఆ వేడి చల్లారక ముందే అమరావతి అక్రమ లావాదేవీలపై మరో దశ చర్యలు ప్రారంభించాలని భావించిందనేది స్పష్టం. అమరావతి భూ సేకరణ అంతా అనుకూలమైన విధానాంలో సాగిందన్నది వైకాపా ముందునుంచి ఆరోపిస్తున్నది. ఈ భూములకు సంబంధించి ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని ముందునుంచి ఆరోపిస్తున్నది. ఆ కేసులో హైకోర్టు స్టే కొనసాగుతుండడం ఒకట్టైతే సుప్రీం కోర్టు ఏప్రిల్ 7న పూర్తి స్థాయి విచారణ జరపనుంది. ఈ పూర్వరంగంలోనే ముందు జాగ్రత్తగా ఎస్‌సిఎస్‌టి అత్యాచార చట్టం కింద అసైన్డ్ భూముల సమస్యపై సిఐడి విచారణ చేపట్టి చంద్రబాబుకు నోటీసులు జారీ చేసింది. రాజధాని ప్రకటనకు ముందు జరిగింది ఇన్‌సైడర్ ట్రేడింగ్ కాగా అధికారిక ప్రకటన తర్వాత బహిరంగంగా నడిచింది అసైన్డ్ భూముల ప్రహసనం. అసైన్డ్ భూములు ప్రభుత్వం ఇచ్చినవే గనక వాటికి పరిహారం అక్కర్లేదని ముందుగా చెప్పారు. నిరసన తర్వాత ఏకమొత్తంగా ఇచ్చి తీసుకుంటామని జీవో తెచ్చారు. ఇవన్నీ మీరు తట్టుకోలేరని భయపెట్టడంతో చాలా మంది దళితులు తమ భూములను పాలకపక్ష పెద్దకు అమ్మేసుకున్నారన్నది ప్రధాన ఆరోపణగా ఉంది. ఆ తర్వాత వారికి కూడా ఇతరులకు ఇచ్చినట్టే ప్లాట్లు ఇస్తామన్నారు. ఇందుకోసం 2015 జనవరి,2016 ఫిబ్రవరి, జూలైనెల్లో మూడు జీవోలు తెచ్చారు. తమను బెదిరించి మోసగించి భూములు తీసుకుని తర్వాత పరిహారం పెంచుకున్నారని అప్పట్లోనే దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై వారు తనకు ఫిర్యాదు చేశారంటూ మంగళగిరి ఎంఎల్ఎ ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిబ్రవరి 24నపోలీసుకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ కేసుమేరకు ఎపి సిఐడి రంగంలోకి దిగి ఎస్‌సి ఎస్‌టి అత్యాచార నిరోధ చట్టం సెక్షన్లతోపాటు 41ఎ కింద అరెస్టు అవకాశం కూడా వుండేలా నోటీసు అందించారు. దీంతో చంద్రబాబు కూడా కౌంటర్ వేసేందుకు ఆలోచిస్తున్నారని సమాచారం. తన న్యాయనిపుణులతో ఆయన చర్చిస్తున్నట్లు గా తెలుస్తోంది. ఢీటుగా ఎదుర్కోవాలన్న పట్టుదలో ఉన్నారని సమాచారం. సిఐడి నోటీసుల ప్రకారం మార్చి 23న చంద్రబాబు సిఐడి ముందు హాజరవుతారా లేదా అన్నది న్యాయ నిపుణులు ఇచ్చే సలహా మేరకు ఆధారపడి ఉంటుంది. న్యాయ నిపుణతో సుదీర్ఘ సంప్రదింపులు జరుపుతున్న చంద్రబాబు కోర్టులో ఈ ఎఫ్ఐఆర్‌ను సవాలు చేసే అవకాశం ఎక్కువగా ఉంది. దళితేతరుడైన ఆళ్ల ఫిర్యాదుపై కేసు పెట్టడం నిలిచేది కాదని కూడా ఆ న్యాయనిపుణులే చెబుతున్నారు. అయితే భూముల వ్యవహారాంలో దళితులకు అన్యాయం జరిగిందా లేదా అన్నది ముఖ్యం.

గతంలో భూ సేకరణ సందర్భంగా అనేకానేక వ్యతిరేక కార్యక్రమాలు బయటకు వచ్చాయి. చంద్రబాబు,ఆయన మనుషులు బెదిరించి భూములు లాక్కుంటున్నారని పలువురు రోడ్డెక్కారు. ఇప్పుడా భూముల విషమంలో చర్చ జరగాలి. నిజంగానే అక్రమంగా భూములను లాక్కుని, బెదిరింపులకు దిగి, పరిహారం ఇవ్వకుంటే విచారణ చేయాల్సిందే. ఎందుకంటే అసైన్డ్ భూములపై వెంటవెంటనే వచ్చిన మూడు జీవోలు విడుదల చేయడంలో దురుద్దేశం వుందని ప్రభుత్వం వాదిస్తుంది. పాలక పక్షం మాత్రం తమకు ఎవరిపై కక్ష లేదనీ, కేవలం వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిందిగా సిఐడికి ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతోంది. అమరావతిని రాజధానిగా ఉంచడమా లేదా అన్నది పక్కన పెడితే భూ సేకరణలో జరిగిన అవకతవకలు ఉంటే వెలికి తీయాల్సిందే. మల్లన్న సాగర్ సహా అనేక చోట్ల భూ సేకరణలో అక్రమాలు చోటు చేసుకు న్నాయి. రైతులను బలవంతంగా భూములు లాక్కుంటున్నారు. ఇలాంటి వ్యవహారాలు ఇకముందు జరగవని చెప్పగలగాలి. అలా చేస్తే జగన్ నిజాయితీని అందరూ ఆహ్వానిస్తారు. చంద్రబాబు అవినీతిని వెలికి తీయాలన్న లక్ష్యం ద్వారా జగన్ తన నిజాయితీని చాటుకోవాలి. చంద్రబాబు కూడా అప్పట్లో అవినీతి జరిగిందా లేదా అన్నది ప్రకటించాలి. నిజాయితీ చాటి తన రాజకీయ సచ్చీలతను ప్రజలకు వివరించాలి.

కేరళలో ప్రభావం చూపనున్న బంగారం కేసు

శబరిమల ఆలయ వివాదాలపైనా ప్రజల్లో చర్చ

మెట్రో మ్యాన్ శ్రీధరన్ రాకతో రసవత్తరంగా రాజకీయాలు

తిరువనంతపురం,మార్చి18 (ఆర్ఎన్ఎ): దేశంలో తీవ్రంగా కుదిపిన బంగారం కుంభకోసం ఇప్పుడు కేరళ రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషిస్తుందన్న చర్చ సాగుతోంది.

దీని వెనక సిఎం పినరయ్ విజయ్ ఉన్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇది ఎంతవరకు నిజమో కానీ ప్రధాన అవినీతి కేసుగా నిలిచిపోయింది. ఇకపోతే మెట్రో మ్యాన్ శ్రీధరన్ బిజెపి ద్వారా రాజకీయాల్లో చేరడంతో కేరళ రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఎన్నికల్లో ఇప్పుడు ఈ రెండు విషయాలు ప్రధాన చర్చగా మారాయి. అయితే రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలు తమతో ఉన్నారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధీమా వ్యక్తం చేశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కన్నూర్ జిల్లాలోని థర్మధామ్ నుండి ఆయన పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే..ఆరవ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించి నట్లవుతుంది. మంచి రాజకీయ వేత్తగా పేరు తెచ్చుకున్న ఆయన సరికొత్త రికార్డును సృష్టించేందుకు సిద్ధమయ్యారు. కేరళలో ఇప్పటి వరకు వరుసగా రెండు సార్లు ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన నేత లేకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో ఏర్పడిన ప్రకృతి వైపరీత్యాలు, తుఫాను, వరదలు, కోవిడ్ వైరస్ వ్యాప్తిని సమర్థవంతంగా ఎదుర్కొవడంలో తమ ప్రభుత్వం సఫలమైందని ఆయన ఎప్పుడూ చెబుతుంటారు.

విపత్తులు, సంక్షోభాలు వచ్చి..రాష్ట్రాన్ని అతలాకుతలం చేసినప్పటికీ..అభివృద్ధి పథాన కేరళ దూసుకు వెళ్లిందని అన్నారు. సైద్ధాంతిక పరంగా..ముఖ్యంగా బిజెపి వంటి ప్రతిపక్షాలతో పోరాడాల్సిన అసవరం ఉందని స్పష్టం చేశారు. బిజెపి సర్కార్ అతి దూకుడుగా తీసుకుంటున్న రాజ్యాంగ వ్యతిరేక, లౌకిక వ్యతిరేక విధానాలకు కేరళ ప్రభుత్వం అడుగడుగునా అడ్డుగోడగా నిల్చుందని అన్నారు. బిజెపి వంటి విచ్ఛిన్నకర శక్తులను కేరళ ప్రజలు ఎన్నటికీ అనుమతించరని పేర్కొన్నారు. ఇప్పుడు శ్రీధరన్ సిఎం అభ్యర్థిగా రావడం లెఫ్ట్, కాంగ్రెస్ కూటమిలకు కొంద ఎదురుదెబ్బే కాగలదు. ఇకపోతే ఇటీవల కేరళ రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారిన శబరిమల అంశంపై కూడా ప్రజల మనోభావాలు కూడా ఎలా ఉన్నాయో తెలియాల్సి ఉంది. సుప్రీంకోర్టు తీర్పును శిరసావహించి... మహిళలను దేవాలయాల్లోకి ప్రవేశించేందుకు అనుమతినివ్వడం... ఆ దిశగా చర్యలు తీసుకోవడం పట్ల ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయి.

అయితే రాబోయే ఎన్నికలపై అంతగా ప్రభావితం చూపే అవకాశాలు ఉండకపోవచ్చునని అన్నారు. శబరిమల అంశాన్ని కొందరు పనిగట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, తమ రాజకీయ లబ్ది కోసం వినియోగించుకుంటున్నారని విజయన్ అన్నారు. అదేవిధంగా కరోనా సమయంలో ప్రజలతో మమేకయ్యేందుకు వీలుగా ఉన్న మీడియాతో చర్చించకపోవడం.. తుపాను వరద బాధితుల పునరావాసాలపై ఏర్పాటు చేయడంలో విఫలమైందంటూ ప్రతిపక్షాల వ్యాఖ్యలను విజయన్ తోసిపుచ్చారు.

ప్రజలను విభజించాలన్న బిజెపి కుతంత్రాలను అడ్డుకున్నదీ వామపక్ష ప్రభుత్వమేనని విజయన్ అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌పై స్పందిస్తూ...తమను ఓడించాలన్న ఏకైక లక్ష్యంతో ఎన్‌డిఎతో కలిసి యుపిఎ కుతంత్రాలకు తెరలేపిందని ఘాటుగా విమర్శించారు. మోడీ చేతుల్లో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నాయన్న ఆరోపణలు గుప్పించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు...ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడం చూస్తే ...బిజెపి సర్కార్ కుహనా రాజకీయాలు ఇట్టే అర్థమౌతాయని అన్నారు. తిరిగి తాము అధికారంలోకి వస్తే వాతావరణ మార్పులకు తగిన విధానాలను రూపొందించడంపై దృష్టి సారిస్తామని సిఎం విజయన్ తెలిపారు.

తిరుపతి ఉప ఎన్నిక బిజెపికి అంత ఈజీ కాదు

స్థానిక ఎన్నికలే ఎదుర్కోలేక డీలాపడ్డ కమలం

మోడీ నిర్ణయాలతో ఆగ్రహంగా ఉన్న ఎపి ప్రజలు

తిరుపతి,మార్చి18(ఆర్ఎన్ఎ): ఏపీలో స్థానిక ఎన్నికలల్లో భారీ విజయంతో ఉన్న అధికార వైసిపి, తిరుపతి ఉప ఎన్నికల్లో విజయం నల్లేరుమీద నడకేనని భావిస్తోంది. అలాగే తిరుపతిలో 3లక్షల భారీ మెజార్టీతో గెలుస్తామని మంత్రి రామచంద్రారెడ్డి ప్రకటించారు. స్థానిక ఎన్నికలకు భిన్నంగా ఉప ఎన్నికలో ఫలితం ఉంటుందా అన్నది అనుమానమే. ఇకపోతే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమమకం మొదలు అనేక విషయాల్లో కేంద్రం వైఖరితో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కేంద్రం నిర్ణయాలు కమలం పార్టీని తీవ్ర నిరాశలో ముంచేశాయి. దీనికి తోడు స్థానిక ఎన్నికల్లో బిజెపి ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. తిరుపతి ఎన్నికల ముందు బిజెపికి ఓ రకంగా ఈ ఫలితాలు తీవ్ర నిరాశకు గురి చేసేవిగా ఉన్నాయి. తిరుపతిలో జెండా పాతుతామన్న వారి ఆశలపై ప్రజలు నీళ్లు చల్లారనే బదుఉ ల..తమగోతిని తామే తవ్వుకున్నారు. వారు ప్రజలను విడిచి చేస్తున్న సాము కారణంగా ప్రజల్లో బిజెపి పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని స్తానిక ఎన్నికల్లో నిరూపితం అయ్యింది. మొత్తంగా ఏపీలో బిజెపి చతికిలపడిందనే విమర్వలు ఉన్నాయి. మునిసిపోల్స్ లో కూడా ఆ పార్టీ ఎటువంటి ప్రభావం చూపలేదు. అర్బన్ ఓటింగ్ పై పార్టీ పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. టీడిపికి మేమే ప్రత్యామ్నాయం అని, రాబోయేదంతా మా కాలమే అని ఊదరగొట్టిన కమలం నేతలు స్థానిక ఎన్నికల్లో ప్రభావం కూడా చూపించలేకపోయారు. పార్టీ ఎదిగినట్టు మాటల్లో చెప్పే నాయకులు దాన్ని ఓట్లలో సీట్లలో చూపించలేకపోయారు. తిరుపతి ఉప ఎన్నికల ముందు ఈ ఫలితాలు కమలాన్ని కలవరం కలిగిస్తున్నాయి. ఈ తరహా ఫలితాలు ఎదుర్కొన్నా తిరుపతిలో బరిలోకి దిగినా ఫలితం ఉండకపోవచ్చు. తిరుపతి ఎన్నికలకు ముందు ఈ పరాజయం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. జనసేనతో కలసి పోటీ చేయటం ద్వారా తిరుపతిలో గెలుస్తామన్న వారి ఆశ నెరవేరకపోచ్చు. ముఖ్యంగా జనసేన, బిజెపి మిత్ర పక్షాలే అయినా...పోటీలో మాత్రం అది ఎక్కడా కనిపించలేదు. ఎవరికివారే అన్నట్టు వ్యవహరించారు. ఒకరితో ఒకరు సహరించుకోలేదు. వారి ఉమ్మడి పోటీని ప్రజలు కూడా ఆహ్వానించలేదు. దీనికి అంతటికీ కారణం కేవలం కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలే కారణంగా చెప్పాలి. విశాఖ ఉక్కు, ఇతర పరిణామాల నేపథ్యంలో తిరుపతి పెద్ద సవాల్ కాబోతోంది. గెలుపు సంగతి ఎలా ఉన్నా...అక్కడ గౌరవ ప్రదమైన ఓటు తెచ్చుకోకపోతే...బిజెపి పట్ల ఉన్న భ్రమలు కూడా తొలగిపోతాయి. తెలంగాణలో ఎన్నో ప్రయోగాలు చేసి విఫలమైన బిజెపి నాయకత్వం బండి సంజయ్ ని అధ్యక్షుడిగా నియమించింది. హైకమాండ్ అంచనాలకు తగ్గట్టు సంజయ్ దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల్లో బిజెపిని ప్రభావశీలంగా నిలిపారు. అయితే తెలంగాణ పరిస్థితుఉల, ఎపి పరిస్థితులు వేరు. తిరుపతిలో పోటీకి ఉవ్విళ్లూరుతున్న బిజెపి ముందుగా కేంద్రంతో ఒప్పించి ఎపిలో సమస్యలపై దృష్టి సారించాలి.

విశాఖ ఉక్కు ఆందోళనలతో కరగని కేంద్రం మనసు

అమ్మకానికే అడుగుల వేస్తున్న ప్రభుత్వం

గట్టిగా నలిదీయడంలో ప్రభుత్వం విఫలం

విశాఖపట్టణం,మార్చి18(ఆర్ఎన్ఎ): మోదీ హయాంలో ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు రూపొందించిన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఏపిఏ) క్రింద అరెస్టులు 72 శాతం పెరిగాయని పార్లమెంట్‌లో హోంమంత్రిత్వ శాఖే అంగీకరించింది. ఉద్యమాలను, నిరసన తెలిపే వారిని, రాజకీయ ప్రత్యర్థులను ఆఖరుకు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలనూ కూడా సహించలేని పరిస్థితికి మోదీ ప్రభుత్వం చేరుకున్నది. భారత దేశాన్ని నియంతృత్వపాలన దిశగా మోదీ సర్కార్ తీసుకువెళుతోందని దేశంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాము తీసీఉకున్న నిర్ణయాలను అమలు చేయాలన్న మొండి వైకరితో విశాఖ ఉక్కు తదితర సంస్థలను తుక్కుగా అమ్మేందుకు సిద్ధం అయ్యారు. వేలాది కోట్ల రూపాయల అస్తులను కలిగి ఉన్న సంస్థను పోస్కోలాంటి సంస్థకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలు సాగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలపైన కేంద్రం ఒకేసారి రెండు దెబ్బలు కొట్టింది. నెలరోజులుగా ఆందోళన చేస్తున్నా, మొన్న అయిదవ తేదీన రాష్ట్ర బంద్ జరిపినా విశాఖ ఉక్కును అమ్మడం ఖాయమని ప్రకటించింది.ఈ విషయంలో ఎలాంటి పునరాలోచన లేదని, రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో ప్రమేయం కూడా లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రకటించారు. నూరు శాతం వ్యూహాత్మక అమ్మకానికి సన్నాహంగా వాటాల రేట్లు అమ్మకం వివరాలు రూపొందుతున్నాయని స్పష్టం చేశారు. కంటి తుడుపులా ఆమె ప్రకటనలో ఉద్యోగులు ప్రజలకు కూడా వాటాలు అందేందుకు వీలైన విధి విధానాలు ఆలోచిస్తామన్నారు. అసలు ఈ సంస్థలో ఏపీ ప్రభుత్వానికి ఎలాంటి వాటా లేదని ఆర్థిక మంత్రి కుండబద్దలు కొట్టి ప్రకటించారు. అయినా దానితో సంప్రదించామని తగు సమయంలో దానికి నిర్ణయాలు తెలియజేస్తామని వివరించారు. నిజానికి కేంద్రం నిర్ణయంపై జగన్ ప్రభుత్వం గట్టిగా నిలదీయలేకపోతోంది. కారణం అవినీతి కేసుల్లో ఎక్కడ ముందుకు తెస్తారో అన్న భయం కారణం కావచ్చు. ప్రజల కార్మికుల ఆందోళన మోడీ సర్కారుపై ఇసుమంతైనా ప్రభావం చూపించలేదని దీంతో స్పష్టమైపోయింది. సీతమ్మ ధారలో ఉక్కు ఫ్యాక్టరీకి చెందిన 22 ఎకరాలకు పైగా స్థలాన్ని డెవలప్ చేసేందుకు నేషనల్ బిల్డింగ్ కన్‌స్టక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బిసిసి)తో ఆర్‌ఐఎన్ఎల్ ఫిబ్రవరి 26నే ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే అక్కడున్న 900 పైగా క్వార్టర్లను కూలగొట్టి వ్యాపార సముదాయాలను నిర్మించితే వెయ్యి కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఈ భూమిని అమ్మడం ద్వారా నిధులు సమకూర్చుకోవచ్చని ఏపీ ముఖ్యమంత్రి జగన్ కూడా సూచించగా కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. కాని జరుగుతున్న వ్యవహారం మొత్తం ఆ దిశలోనే వుంది. ఈ కథలో కొసమెరుపు ఏమంటే వి

సాయుధ దళాలకే బలాన్నిస్తున్న ఆర్డినెన్స్ ఫాక్టరీలు

(18 మార్చి 'ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డే'సందర్భంగా)

దేశ రక్షణకు సుశిక్షితులైన సైనికులు ఎంత అవసరమో, దేశ భద్రత విషయంలో వారు వినియోగించే నాణ్యమైన అత్యాధునిక ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పరికరాలు లాంటివి కూడా అంతే ముఖ్యమని గమనించాలి. ఆయుధ సామాగ్రిని ఉత్పత్తి చేసే గురుతర బాధ్యతలను ప్రతిష్టాత్మక దేశ 'ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు' దాదాపు గత రెండున్నర శతాబ్దాలుగా చేపట్టి, సగర్వంగా నూతనోత్సాహంతో ముందుకు సాగుతోంది. 1775లో స్థాపించబడిన భారత ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు కేంద్ర కార్యాలయమైన 'ఆయుధ భవన్', కలకత్తాలో ఉన్నది. ఈ బోర్డు పరిధిలోకి దేశవ్యాప్తంగా విస్తరించబడిన 41 ఆర్డినెన్స్ ఫాక్టరీలు, 9 శిక్షణ సంస్థలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రాలు మరియు 5 ప్రాంతీయ భద్రత నియంత్రణ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. 18 మార్చి 1802 రోజున కలకత్తా సమీపాన కోసిపోర్ వద్ద ప్రారంభమైన భారత రక్షణ పరికరాల తయారీ కేంద్రం ప్రపంచంలోనే 37వ, ఆసియాలో 2వ మరియు దేశంలో అతి పెద్ద పురాతన ప్రభుత్వరంగ పరిశ్రమ అయిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ద్వారా అతి ముఖ్యమైన రక్షణరంగ పరికరాలు (ఆయుధాలు, విడిభాగాలు, రసాయనాలు, ఆర్టిల్లరీ, అమ్యునిషన్, రక్షణ పరికరాలు లాంటి) తయారు చేయబడుతున్నాయి. రక్షణశాఖలోని త్రివిధ దళాలైన ఆర్మీ, నావీ మరియు వాయు సేనలకు అవసరమైన నాణ్యమైన మందుగుండు సామాగ్రి, ఆయుధ పరికరాలను తయారు చేసి సకాలంలో సరఫరా చేయడం జరుగుతుంది.

దేశ భద్రతలో త్రివిధ దళాలతో పాటు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అందిస్తున్న సేవలను గుర్తు చేసుకునే సందర్భంగా ప్రతి ఏటా 18 మార్చిన 'ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డే / ఆయుధ సామాగ్రి ఉత్పత్తి పరిశ్రమ దినం' పాటించుట జరుగుతోంది. త్రివిధదళాలకు వెన్నెముకగా నిలిచిన నాలుగో బలగంగా మరియు సాయుధ దళాలకు బలాన్ని చేకూర్చే ఆయుధ కేంద్రంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. దేశ రక్షణ మంత్రిత్వశాఖలోని రక్షణ ఉత్పత్తుల విభాగం పరిధిలో పని చేసే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ద్వారా ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, ఆయుధ విడిభాగాలు, రసాయనాలు, విస్ఫోటన పదార్థాలు, పారాచూట్లు, తోలు మరియు వస్త్ర ఉత్పత్తులు, పరిశోధనలు, పరీక్షల నిర్వహణ, అభివృద్ధి, మార్కెటింగ్, గ్రెనేడ్లు, మైన్స్, మిసైల్ మరియు రాకెట్ లాంచర్స్, మిలిటరీ వాహనాలు, ఎయిర్‌క్రాఫ్ట్ ఆయుధాలు, లాజిస్టిక్స్ లాంటి అనేక నాణ్యమైన భూతల, గగన, సముద్ర వ్యవస్థలకు సంబంధించిన ఉత్పత్తులను తయారు చేస్తున్నది. దేశ త్రివిధ దళాలకే కాకుండా 30కి పైగా దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సేవలు వెలకట్టలేనివి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నడుస్తున్న ప్రభుత్వ రక్షణశాఖ సంస్థగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు అనాదిగా ఖ్యాతి గాంచింది. 18 మార్చి రోజున జరిగే 'ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డే' వేదికగా బోర్డు ఉత్పత్తి చేసిన ఆయుధాలు, రక్షణ పరికరాలు, ఆర్టిల్లరీ, రైఫిల్స్, గన్స్, పారాచూట్లు లాంటివి ప్రదర్శించడంతో పాటుగా కవాతుల నిర్వహణ మరియు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఆయుధ శ్రీ, ఆయుధ దేవి, ఆయుధ భూషన్, ఆయుధ రత్న లాంటి ఆవార్డులు కూడా అందిస్తారు. అసాధారణ సేవలు అందిస్తున్న 'సాయుధ దళాల వెనుక బలం (ఫోర్స్ బిహైండ్ ఆర్మ్డ్ ఫోర్సెస్)'గా పేరు గడించిన ఆయుధ సామాగ్రి ఉత్పత్తి కేంద్రాలైన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు దేశ రక్షణ రంగాలకే వెన్నెముకలుగా నిలుస్తున్నాయని మరువరాదు. 'ఫోర్త్ ఆర్మ్ ఆఫ్ డిఫెన్స్'గా పేరుగాంచిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు పరిధిలో 80,000లకు పైగా ఉద్యోగులు అవిశ్రాంత సేవలు అందిస్తున్నారు. దేశ రక్షణలో తెర వెనుక నిలిచి విశేష సేవలు అందిస్తున్న ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల కృషికి ప్రతి భారతీయుడు గర్వపడుతూ, కృతజ్ఞతలను తెలియజేద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న జాతిరత్నాలు టీమ్

తిరుమల,మార్చి18(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ తర్వాత థియేటర్స్‌లో విడుదలై మంచి విజయం సాధించిన చిత్రాలలో జాతిరత్నాలు మూవీ ఒకటి. నవీన్‌పొలిశెట్టి-ఫరియా అబ్దుల్లా హీరోహీరోయిన్లుగా అనుదీప్ కేవీ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఫన్ ఎంటర్‌టైనర్ రిసెంట్‌గా విడుదల కాగా, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి కావలసినంత వినోదాన్ని అందించింది. ఈ సినిమా విజయాన్ని చూసి చిత్ర హీరో నవీన్ పొలిశెట్టి ఎమోషనల్ అయి కంట కన్నీరు కూడా పెట్టుకున్నారు. జాతి రత్నాలు టీం ఇంత మంచి విజయం సాధించిన నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆశీస్సులు అందుకునేందుకు కాలినడకన కొండకు చేరుకున్నారు జాతిరత్నాలు టీం. ఈ రోజు ఉదయం వీఐపీ దర్శన సమయంలో వారు స్వామి వారిని దర్శించుకున్నారు. నవీన్ పోలిశెట్టి ..కుర్తా, దోతి ధరించి సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తున్నాడు

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై ఆరోపణలు చేయడం సరికాదు

రాజన్న సిరిసిల్లా, మార్చి 18 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ గురుకుల విద్యాలయ ఆనంద్, స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షులు నేదూరి కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై బిజెపి అభిలా ష్ లు మాట్లాడుతూ ఎంతో మంది నాయకులు అసత్యపు ఆరోపణలు చేయడం ఎస్సీ ఎస్టీ విద్యార్థులను ఇంజనీర్లు గా సరికాదని అంబేద్కర్ సంఘం డివిజన్ ,దాక్టర్లుగా, సైంటిస్టులు గా తీర్చిదిద్దుతున్న అధ్యక్షులు దుమ్ము ఆనంద్ అన్నారు, ప్రవీణ్ కుమార్ పై మత ఛాందసవాదులు, చందుర్తి మండల కేంద్రంలో గురువారం బిజెపి పార్టీ వారు అసత్య ఆరోపణలు చేస్తూ స్వేరోస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారన్నారు, చేపట్టారు, అనంతరం ఉప తాసిల్దార్ మచ్చలేని అధికారిపై ఆరోపణలు చేయడంతో గోపాల్, ఎస్ఐ సునీల్ కు వినతి పత్రాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు, ఇక ముందు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు, ఈ కార్యక్రమంలో స్వేరోస్ మండల అధ్యక్షులు లక్కే సాగర్ నాయకులు లింగాల సుధాకర్, బత్తుల కమలాకర్, కట్కూరి చంద్రయ్య,గొట్టే ప్రభాకర్, లింగంపల్లి అజయ్, కొమ్ము రమేష్, సంటి ప్రసాద్, వేణు, లింగంపల్లి వెంకటి తదితరులు పాల్గొన్నారు,

లడ్డూ తయారీ కేంద్రంలో పేలిన పొయ్యి

–మహిళా కార్మికురాలికి గాయాలు

విజయవాడ,మార్చి18(ఆర్ఎన్ఎ): ప్రముఖ పుణ్యక్షేత్రం కనకదుర్గ ఆలయంలోని లడ్డూ తయారీ కేంద్రంలో గురువారం గ్యాస్ స్టౌవ్ పేలింది. లడ్డు తయారు చేస్తున్న సమయంలో పొయ్యి ఒక్కసారిగా పేలడంతో లడ్డు తయారీ కార్మికులు భయభ్రాంతులకు గురయ్యారు. పొయ్యి పేలిన ఘటనలో దుర్గా అనే కార్మికురాలికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే ఈవో సురేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ... గ్యాస్ పొయ్యి పైపు లీక్ అవడంతో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని వెంటనే స్పందించి ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. స్వల్ప గాయాలైన మహిళకు ప్రథమ చికిత్స చేశారని, తిరిగి విధుల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఎటువంటి నష్టం కానీ జరగలేదన్నారు. వెంటనే పొయ్యిల పనితీరును పరిశీలించాలని సిబ్బందికి సూచించామని ఈవో సురేష్ బాబు తెలిపారు.

నిజాం సాగర్ ప్రాజెక్టుకు గోదావరి జలాలు

సిద్దిపేట,మార్చి18(ఆర్ఎన్ఎ): ఈ నెల 25న నిజాంసాగర్ ప్రాజెక్టుకు గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ గజ్వేల్ ఏరియా ఎస్ఈ వేణు తెలిపారు. బుధవారం గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఊరచెరువు మినీట్యాంక్‌బండ్ , రాజిరెడ్డి పర్కికుంట, గజ్వేల్ పాండవుల చెరువు మినీట్యాంక్‌బండ్, నాచారం హల్దీవాగు చెక్‌డ్యాం, నాచారం పెద్దచెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నీటి విడుదల నేపథ్యంలో నాచారం లక్ష్మీనర సింహ్మ స్వామి దేవస్థాన ప్రాంగణంలోని హల్దీవాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి అధికారులను ఆదేశించారు.

కరోనా విజృంభణపై సిఎం కెసిఆర్ ఆందోళన

1నుంచి 8తరగతుల వరకు స్కూళ్లు మూసేసే ఆలోచన

హైదరాబాద్,మార్చి17(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లలో కరోనా విజృంభనపై ఆందోళన వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్ స్కూళ్లు, పరీక్షల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విద్యార్థులు కరోనా భారిన పడుతుండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎస్ సోమేష్‌కుమార్, విద్యాశాఖ అధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6వ తరగతి నుంచి స్కూళ్లు కొనసాగుతున్నాయి. కరోనా విజృంభన నేపథ్యంలో 1 నుండి 8వ తరగతి వరకు స్కూళ్లను మూసివేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తరగతుల విద్యార్థులను పరీక్షలు లేకుండానే పై తరగతులకు ప్రమోటు చేసే ఆలోచనలో విద్యాశాఖ ఉన్నట్లుగా సమాచారం. పరీక్షల నిర్వహణపై సీఎం కేసీఆర్ త్వరలోనే నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

ఆటోను ఢీకొన్న కారు: ఏడుగురికి గాయాలు

ఏలూరు,మార్చి18(ఆర్ఎన్ఎ) పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణ పురం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను కారు ఢీకొనడంతో.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. ఏలూరు నుంచి అడవికొలను వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులు అందరూ ఏలూరు తూర్పు వీధికు చెందిన వారు కావడం గమనార్హం.

విశాఖ మేయర్‌గా గొలగాని హరి వెంకటకుమారి

విశాఖపట్నం,మార్చి18(ఆర్ఎన్ఎ): 9 ఏళ్ల తర్వాత గ్రేటర్ విశాఖ పాలకమండలి కొలువుదీరింది. విశాఖ మేయర్‌గా గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్‌గా జియ్యాని శ్రీధర్ ఎన్నికయ్యారు.

విశాఖ మేయర్ పదవి దక్కకపోవడంపై నగర వైసీపీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇచ్చిన తన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తానొక దురదృష్టవంతుడ ని అంటూ వంశీ భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని దుష్ట శక్తులు తనను అడ్డుకున్నాయని ఆరోపించారు. తాను ఒక సామాన్య కార్యకర్తగా ఉంటానని చెబుతూ...నిరసన చేసిన అభిమానులను వంశీ కృష్ణ శ్రీనివాస్ ఓదార్చారు. వంశీకి మేయర్ పదవి ఇవ్వకపోవడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన వర్గీయులు జీవీఎంసీ ఔట్ గేట్ వద్ద ఆందోళనకు దిగారు. కొందరు మహిళలు కంటతడిపెట్టుకున్నారు. సీఎం జగన్, ఎంపీ విజయసాయి రెడ్డికి వ్యతిరేకంగా వంశీ అనుచరులు నినాదాలు చేశారు. మేయర్ పదవిపై చాలా ఆశలు పెట్టుకున్నా.. ఆ పదవి దక్కపోవడంతో నగర వైసీపీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇచ్చిన తన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తాను ఒక సామాన్య కార్యకర్తగా ఉంటానని చెబుతూ.. నిరసనగళం వినిపించారు. అక్కడే ఉన్న అభిమానులను వంశీ కృష్ణ శ్రీనివాస్ ఓదార్చారు. వంశీకి మేయర్ పదవి ఇవ్వకపోవడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన వర్గీయులు జీవీఎంసీ ఔట్ గేట్ వద్ద ఆందోళనకు దిగారు. కొందరు మహిళలు కంటతడిపెట్టుకున్నారు. సీఎం జగన్, ఎంపీ విజయసాయి రెడ్డికి వ్యతిరేకంగా వంశీ అనుచరులు నినాదాలు చేశారు.మొదట కేవలం నిరసన గళం వినిపించి ఊరుకున్న ఆయన.. తరువాత పరిణామాల క్రమంలో వైసీపీ నగర అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వైసీపీ నగర అధ్యక్ష పదవికి వంశీ కృష్ణ శ్రీనివాస్ రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. తనకు మేయర్ పదవి దక్కకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. వైసీపీలోని కొన్ని శక్తులు తనకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం జగన్‌ను కలుస్తానని వంశీకృష్ణ వెల్లడించారు. మేయర్ పదవి ఇస్తానంటేనే తాను కార్పొరేటర్‌గా పోటీ చేశానని.. కానీ ఇప్పుడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు

డిప్యూటీ మేయర్‌గా జియ్యాని శ్రీధర్
వంశీ కృష్ణ శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తి
నగర పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా యోచన
వంశీ అనుచరుల ఆందోళన
విజయసాయికి వ్యతిరేకంగా నినాదాలు

గుంటూరు నగర మేయర్‌గా కావటి మనోహర్

– నగర ప్రథమ పౌరుడుగా ప్రమాణం

గుంటూరు,మార్చి18(ఆర్ఎన్ఎ): గుంటూరు నగర మేయర్‌గా కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్‌గా డైమండ్ బాబు బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి హోంమంత్రి సుచరిత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని 11 నగరపాలక సంస్థల్లో మేయర్, డిప్యూటీ మేయర్, 75 పురపాలక నగర పంచాయతీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికల ప్రక్రియ జరుగుతోంది.

గుంటూరు కన్వెన్షన్ సెంటర్లో వైసీపీ కార్పొరేటర్లు గురువారం ఉదయం సమావేశమయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికపై పార్టీ నిర్ణయాన్ని ఇంచార్జ్ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు వెల్లడించారు. ఈ సమావేశానికి హోం మంత్రి సుచరిత, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.గుంటూరు నగరపాలకంస్థ నూతన మేయర్, కార్పొరేటర్ల ప్రమాణస్వీకారానికి నగర కమిషనర్ చల్లా అనురాధ పర్యవేక్షించారు. అర్బన్ ఎస్పీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్లకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు మాత్రమే కౌన్సిల్ హాల్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. ప్రమాణ స్వీకారానికి తగిన బందోబస్తు ఏర్పాట ుచేసామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ సందర్శకులకు నగరపాలక సంస్థ కార్యాలయ పార్కింగ్ ప్రాంతంలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రమాణస్వీకారం ప్రశాంతంగా జరిగేలా సహకరించారని అన్నారు.

తాడిపత్రిలో ఇక గూండారాజ్ ఉండదు: జెసి

అనంతపురం,మార్చి18(ఆర్ఎన్ఎ): తాడిపత్రిలో ఉత్కంఠకు తెర పడింది. టెన్షన్ వాతావరణం నడుమ చైర్మన్‌గా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి ఎన్నికవగా వైస్ చైర్మన్‌గా సరస్వతి ఎన్నికయ్యారు.

టీడీపీకి ఉన్న 18 మంది కౌన్సిలర్ల బలానికి తోడు సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు మద్దతివ్వడంతో ప్రభాకర్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్సీల ఎక్స్‌అఫీషియో ఓట్లను మున్సిపల్ కమిషనర్ తిరస్కరించిన నాటి నుంచి ఈ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు శిబిరాలను సైతం ఏర్పాటు చేశాయి. మొత్తానికి జేసీ ఎన్నికతో ఉత్కంఠకు తెరపడింది. కాగా.. చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం జేసీ మీడియాతో మాట్లాడుతూ.. తాడిపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

తాడిపత్రిలో రౌడీయిజం... గుండాయిజం ఇక ఉండదన్నారు. సేవ్ తాడిపత్రి తమ నినాదంగా పేర్కొన్నారు. తమ కౌన్సిలర్లు అందరూ బాహుబలిలు, ఝాన్సీ లక్ష్మీబాయిలు

అని జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికకు ముందు వేర్వేరు మార్గాల్లో మున్సిపల్ కార్యాలయానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి చేరుకున్నారు. టీడీపీ, సీపీఐ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లతో మున్సిపల్ కార్యాలయానికి జేసీ చేరుకున్నారు. భారీ కాన్వాయ్‌తో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేరుకున్నారు. అనుమతి లేదంటూ పెద్దారెడ్డి కాన్వాయ్‌ను పోలీసులు నిలిపివేశారు.

బడ్జెట్లో నిధులు లెక్కల్లో చెప్పడం కాదు...చేతల్లో చూపించాలి

– జడ్పిటిసి నాగం కుమార్

రాజన్న సిరిసిల్లా, మార్చి 18 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కల్లో చూపించడం కాదని.. చేతల్లో చూపించాలని చందుర్తి జడ్పిటిసి సభ్యులు నాగం కుమార్ అన్నారు, బడ్జెట్ పై ఆయన గురువారం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకం గా లేదన్నారు, వేములవాడ రాజన్న ఆలయానికి గత నాలుగు సంవత్సరాల కింద బడ్జెట్ లో నాలుగు వందల కోట్ల రూపాయల కేటాయించారని అట్టి నిధులను ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు, ఈ బడ్జెట్లో మండల పరిషత్ జిల్లా పరిషత్ ల కుఐదు వందల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని ఇట్టి నిధులను మాటలతో కాకుండా కాగితాలు (ప్రోసిడింగ్) ల ద్వారా కేటాయించాలన్నారు, ఈ నిధులతో అభివృద్ధి ఏం సాధ్యమవుతుందని ప్రశ్నించారు, ఈ బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి కేవలం 25 కోట్ల రూపాయలను కేటాయించడం పై గీతా కార్మికులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు, ఈ బడ్జెట్లో చేతివృత్తుల వారికి అన్యాయం జరిగిందని కుమార్ అన్నారు,

హైకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్

సిఐడి ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ కేసు
కేవలం కక్షతోనే బాబుకు నోటీసులన్న టిడిపి నేతలు

అమరావతి,మార్చి18(ఆర్ఎన్ఎ): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. రాజధాని భూముల విషయంలో సీఐడీ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం ఏపీ హైకోర్టులో ఆయన తరఫున న్యాయవాదులు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ రాజధాని అమరావతిలో జరిగిన భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో ఈ నెల 16న సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సెక్షన్ 41సీఆర్‌పీసీ కింద నోటీసులు అందజేసి, ఈ నెల 23న విజయవాడలోని కార్యాలయంలో విచారణకు రావాలని సూచించారు. అలాగే టీడీపీ నేత, మాజీ మంత్రి పీ నారాయణ సైతం ఆరోపణలు ఎదుర్కొంటుండగా.. ఆయనకు సైతం బుధవారం సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 22న విచారణకు రావాలని నోటీసుల్లో ఆదేశించారు. ఇదే విషయంలో విజయవాడ, నెల్లూరు, హైదరాబాద్‌లోని నారాయణ విద్యాసంస్థలు, ఆఫీ సుల, నివాసంలో సోదాలు నిర్వహించారు. మోసం, కుట్రతో అసైన్డ్ భూములు లాక్కొన్నారని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృ ష్ణారెడ్డి గత 24న సీఐడీ పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు చంద్రబాబు, నారా యణపై ఎస్సీ, ఎస్టీ చట్టం సహా 10 సెక్షన్ల కింద సీఐడీ అధికారులు ఈ నెల 12న కేసు నమోదు చేశారు. చంద్రబా బుతో పాటు నారాయణకు సీఐడీ ఇచ్చిన నోటీసు లను కక్షపూరితంగా టీడీపీ భావిస్తో ంది. అందుకే న్యాయపోరాటానికి టీడీపీ సిద్ధమై ంది. నేరమే లేని కేసులో చంద్రబాబు నిందితుడు ఎలా అవుతారని టీడీపీ నేతలు ప్రశ్నించారు. జీవోపై దర్యాప్తు చేసే అధికారం సీఐడీకి లేదని అంటున్నారు. బాధితులు, లాభం పొందినవారు కాకుండా ఎమ్మెల్యే ఇస్తే కేసు ఎలా నమోదు చేస్తారని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. 41ఏ కింద నోటీసులు ఇచ్చి సోదాలు చేస్తున్నారంటూ న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు.

కర్నూలు మేయర్‌గా బివై రామయ్య ప్రమాణం

నిష్పక్షపాతంగా పనిచేస్తానన్న మేయర్

కర్నూలు,మార్చి18(ఆర్ఎన్ఎ): కర్నూలు నగర కార్పొరేషన్‌లో కొత్త పాలక వర్గం కొలువుదీరింది. 11 ఏళ్ల తరవాత పాలక వర్గం కొలువైంది. 52 మంది కార్పోరేటర్లు ప్రమాణ స్వీకారం చేయగా.. మేయర్‌గా బీవై రామయ్య, డిప్యూటీ మేయర్‌గా రేణుక సిద్దారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. మేయర్‌గా అవకాశం ఇచ్చిన తమ అధినేత జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మేయర్‌గా నిష్పక్షపాతంతో పని చేస్తానన్నారు. కర్నూలు నగరంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అలాగే నగరాన్ని మోడ్రన్ సిటీగా మార్చడానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేల సహకారంతో నగరాభివృద్ధికి పాటు పడతానని.. నగరంలో ప్రధానమైన సమస్య తాగునీటి కొరతను తీర్చడానికి కృషి చేస్తానని రామయ్య తెలిపారు.

సీరత్ హజ్రత్ అమీరే మావియ (ర.జి) "జల్సా"ను విజయవంతం చేయండి

–ముఫ్తి ఘుఫ్రాన్ అస్సాది పిలుపు

కరీంనగర్, మార్చి 18 (నేటినిజం ప్రతినిధి):ఈనెల 20వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు కారఖాన గడ్డ మస్జిదే మహ్ మూదియా లో నిర్వహించ తలపెట్టిన ఇస్లాం చివరి ప్రవక్త మహమ్మద్ (సల్లం) నమ్మిన సహాబలలో ఒకరైన హజ్రత్ అమీరే మావియ ర.జి జీవితచరిత్రపై జల్సా ఆధ్యాత్మిక సదస్సును విజయవంతం చేయాలని మక్తబ్ మారుఫుల్ ఖురాన్ బాధ్యుడు ముఫ్తి ఘుఫ్రాన్ అస్సాది పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమానికి జమియతుల్ ఉలేమా నగర అధ్యక్షుడు మౌలానా ఉమర్ ఫారూఖ్ ముఖ్యఅతిథిగా, ముఫ్తి యునూస్ ఖాస్మి అధ్యక్షతన, ముఫ్తి నవీద్ సైఫ్ పర్యవేక్షణలో సదస్సు కార్యక్రమం జరుగుతుందన్నారు. తఫ్సీర్ తహఫుజే నామూసే సహాబ వ అప్లే బైత్ ర.జి తెలంగాణ రాష్ట్ర వేదికగా సహాబాల జీవిత చరిత్రపై దశల వారీగా నగరంలో పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సదస్సులు నిర్వహిస్తామన్నారు

ఆహ్వానము
తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో...
కవన కిరణాలు రెండవ కవితా సంకలనం
మరియు అగ్నిశిఖ
పుస్తకావిష్కరణ
ముఖ్య అతిథి
శ్రీ నందిని సిధారెడ్డి గారు
తెలంగాణా సాహిత్య అకాడమి మాజీ ఛైర్మన్, హైదరాబాద్
శ్రీ మామిడి హరికృష్ణ గారు
తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు హైదరాబాద్
శ్రీ బైస దేవదాసు గారు
నేటినిజం దినపత్రిక సంపాదకులు, హైదరాబాద్
గౌరవ అతిథులు
శ్రీ దేవానంద నాగెల్ల గారు
మహాజన సాహిత్య అకాడమి - మహారాష్ట్ర శాఖ అధ్యక్షులు ముంబాయి
శ్రీ దా.పులఖండం శ్రీనివాసరావు గారు
సాహితీ విమర్శకులు, శ్రీకాకుళం
శ్రీమతి తులాల సవరమ్మ గారు
డిప్యూటీ కలెక్టర్, శ్రీకాకుళం
విశిష్ట అతిథులు
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు
సినీ, టీవీ గీత రచయిత, హైదరాబాద్
శ్రీ సాహిత్య ప్రకాష్ గారు
సినీ, టీవీ నటులు & యాంకర్, హైదరాబాద్
స్థలం : హైదరాబాదు
వేదిక : రవీంద్రభారతీ (కాన్ఫరెన్స్ హాలు)
తేదీ : 24-03-2021
సమయం : ఉదయం 9 గం. నుండి 12 గం. వరకు
శివ మంచాల
కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య
సంస్థాపక అధ